ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 7 నవంబరు 2024

కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులతో కలిసి బుధవారం కలెక్టరేట్ వద్దకు పెద్దఎత్తున ర్యాలీగా వచ్చిన ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ నూత న ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మూడు విడుతల విద్యా, వ సతి దీవెన బకాయిలు 3,480 కోట్ల రూపాయలు చెల్లించకపోవడంతో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక వారి ఒత్తిడి భరించలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా లోని రాజంపేట, మదనపల్లె, రాయచోటి ప్రాంతాల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ నర్సింగ్, ఐటీఐ, డిగ్రీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఫీజులు కట్ట లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ ఆ మండలాల్లో ఉపాధి లేక వలస వెళ్లి ఈరోజు విద్యార్థులను చదివిస్తున్నటువంటి పరిస్థితి దాపురించిందని వారు వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మద్దతు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, రాయచోటి ఎస్ఎఫ్ఐ నాయకులు గురునాథ్, పవన్, సతీశ్, మదనపల్లె ఎస్ఎఫ్ఐ నాయకులు జయబాబు, సన్నీ, రాంబాబు, భానుప్రకాశ్, నందకిశోర్, గణేశ్, పవన్‌తేజ్, గోవర్థన్, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జిల్లాకు 44 కొత్త బస్సులు

● స్ర్కాప్‌కు కాలం చెల్లిన బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం పలమనేరు రాము



ఇంటర్వ్యూ

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇప్పటివరకు 44 కొత్త బస్సులు వచ్చాయని, అందులో 17 ఆర్టీసీ బస్సులు, 27 అద్దె బస్సులు ఉన్నాయని ఆర్టీసీ ఆర్ఎం పలమనేరు రాము తెలిపారు. కొన్ని రూట్లలో రోడ్లు బాగా లేకపోవడం వల్ల బస్సులు సమయానికి నడపలేకపోతున్నామని, అయినా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 42 కాలం చెల్లిన బస్సులు స్ర్కాప్‌కు పంపించివేశామని చెప్పారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు చెప్పారు.

ప్రశ్న: అన్నమయ్య జిల్లాకు ఎన్ని కొత్త బస్సులు వచ్చాయి..?
జవాబు: జిల్లాకు ఇప్పటి వరకు కొత్తవి 17 ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు, అద్దె బస్సులు 27 వచ్చాయి.

ప్రశ్న: సమయానికి బస్సులు నడపడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి..?
జవాబు: వేంపల్లె, కదిరి మినహా మిగతా అన్ని ప్రాంతాలకు సమయానికి బస్సులు నడుపుతున్నాము. ఈ రెండు ప్రాంతాలకు రోడ్లు సరిగ్గా లేనందువల్ల ఆర్టీసీ బస్సులు ఎక్కువగా బ్రేక్ డౌన్ కావడం టైర్లు పంచర్లు కావడం వల్ల కాస్త ఆలస్యం అయిన మాట వాస్తవమే. ఒక ఆర్టీసీ బస్సు పంచర్ అయితే దానిని తిరిగి రీప్లేస్ చేయడానికి దాదాపు గంట సమయం పడుతుంది. అదే సమయానికి వేరే బస్సులు పంపించడానికి కొంత సమయం పడుతోంది. కాబట్టి ఆ రోడ్లలో మాత్రమే బస్సులు సమయానికి నడపలేకపోతున్నాం. రోడ్లు సరిగ్గా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతోంది.

ప్రశ్న: కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారని ఫిర్యాదులున్నాయి?
జవాబు: ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 42 కాలం చెల్లిన బస్సులను స్ర్కాప్‌కు పంపించేశాం. వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశాం.

ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని డిపోలు ఉన్నాయి. వాటి పనితీరు ఎలా ఉంది..?
జవాబు: జిల్లాలో మొత్తం 5 డిపోలు ఉన్నాయి. మదనపల్లె-1, మదనపల్లె-2, రాయచోటి-1, పీలేరు-1, రాజంపేట-1 డిపోలలో ఆర్టీసీ బస్సులు, అద్దె బస్సులు బాగా నడుస్తున్నాయి.

ప్రశ్న: ప్రస్తుతం డిపోలోని గ్యారేజ్‌ల పరిస్థితి ఏంటి..?
జవాబు: డిపోలలోని గ్యారేజీ సిబ్బందికి కర్నూలులోని జెడ్ఎస్ఎస్‌లో ఆరు రోజులు ట్రైనింగ్ ఇప్పించిన తర్వాత డిపోలలోని గ్యారేజీకి పంపిస్తున్నాం. జిల్లాలోని ప్రతి డిపో గ్యారేజ్ నుంచి ఎవరైతే మెకానిజం చేయటంలో వెనుకబడి ఉన్నారో వారందరికీ బ్యాచ్‌ల వారీగా విభజించి కర్నూలుకు పంపిస్తున్నాం.

టమోట పంటకు వాతావరణ ఆధారిత ఇన్సూరెన్సు

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రవిచంద్రబాబు

6

రైల్వేకోడూరులో యువకుడి దారుణ హత్య

సబ్ కలెక్టర్ కార్యాలయంలో దహనమైన ఫైళ్లు (ఫైల్)



రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్ల దహనం కేసులో ఏపీ సీఐడీ విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా మంగళ, బుధవారాలలో సీఐడీ అధికారులు మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయపు రికార్డు గదిలో ఉన్న రికార్డులు, డాక్యుమెంట్లను తమ వద్ద ఉన్న పలు డాక్యుమెంట్లతో సరిచూసుకున్నారు. మదనపల్లె చుట్టుపక్కల అత్యంత విలువైన భూములున్న ప్రాంతాలలో క్రయవిక్రయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురిని పిలిపించి విచారించి స్టేట్‌మెంట్లను నమోదు చేశారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీఐడీ తనిఖీలు

● ఫైళ్ల దహనంపై ముమ్మరంగా విచారణ

● డాక్యుమెంట్లు, రికార్డుల పరిశీలన..

(రాయచోటి- ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జూలై 21వ తేదీ అర్ధరాత్రి పలు కీలకమైన డాక్యుమెంట్లు అగ్నికి ఆహుతయ్యాయి. తొలుత ఇది ప్రమాదకర సంఘటనగా భావించినప్పటికీ తర్వాత దీని వెనుక కొందరి హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సాక్షాత్తు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి ద్వారకా తిరుమలరావు, సీఐడీ ఉన్నతాధికారి రవిశంకర్ అయ్యన్నార్, రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ప్రిన్సిపల్ కార్యదర్శి సిసోడియాలు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. దీంతో కేసు విచారణ రూటు మార్చి వేగం అందుకుంది. సంఘటనా స్థలంలో ఉన్న సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో కుట్రకోణం వెలుగులోకి వచ్చింది. గత ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్న పలువురు నాయకులు చేసిన అనేక భూఅక్రమాలు వెలుగులోకి రాకూడదనే ఈ ఫైళ్లు కాల్చివేసినట్లు ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. ఈ నేపథ్యంలో ఈ సంఘటనలో అన్ని కోణాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును ఏపీ సీఐడీకి అప్పగించింది. అప్పటి నుంచి సీఐడీ పోలీసులు లోలోపల కేసును విచారిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి సమాచారం సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళ, బుధవారాలు మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీఐడీ పోలీసులు రికార్డులను పరిశీలించారు.

సోదాల్లో దొరికిన డాక్యుమెంట్లే లక్ష్యంగా..

ఫైళ్ల దహనం తర్వాత పోలీసులు మదనపల్లె మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాష, మాజీ మంత్రి పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి, మరో వైసీపీ నాయకుడు బాబ్‌జాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతితో పాటు పలువురి ఇళ్లపై ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తాల కొద్దీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పలు బినామీ పేర్లతో ఉన్న డాక్యుమెంట్లు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సీఐడీ పోలీసులు అప్పుడు స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల సంగతి తేల్చుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసిన ముగ్గురు సీఐడీ పోలీసులు బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ తనిఖీలు కొనసాగించారు. తాము స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని రికార్డు గదిలో ఉన్న రికార్డులతో పోల్చి చూశారు. తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లకు సంబంధించి లింక్ డాక్యుమెంట్లు, ఈసీలను కూడా పరిశీలించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని సిబ్బంది, ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మదనపల్లె మండలం పోతబోలు, కురబలకోట మండలం అంగళ్లు, కురబలకోట రెవెన్యూ గ్రామాల పలు సర్వే నెంబర్లకు సంబంధించిన రికార్డులపై ఆరా తీసినట్లు తెలిసింది. ఇందులో భాగంగా స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు రెండు రోజుల క్రితం ఇదే డాక్యుమెంట్లకు సంబంధించిన యజమానులను పిలిపించి మాట్లాడినట్లు సమాచారం. మీ పేరు మీద ఉన్న డాక్యుమెంటు ఇతరుల ఇళ్లలో ఎందుకు ఉంది..? మీ భూమిని అమ్మకానికి పెట్టారా..? ఎవరైనా బలవంతంగా లాక్కునారా..? భూమి అమ్మమని ఒత్తిడి చేస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. తమ భూమి ఎవరికీ అమ్మలేదని, రికార్డులు కూడా తమ వద్దే ఉన్నాయని, మా భూమికి సంబంధించిన జిరాక్స్ కాపీలు వాళ్లకు ఎలా వెళ్లాయో మాకు తెలియదని కొందరు సమాధానం ఇచ్చారు. వీళ్లలో మరికొందరు తమ భూమి ఎప్పుడో ఇతరులకు అమ్మేశామని చెప్పారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని చెప్పి వీళ్లను పంపించేశారు. సీఐడీ విచారించిన వారిలో రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సామాన్య ప్రజలు కూడా ఉన్నారు. స్థానిక సివిల్ పోలీసుల సాయంతో మదనపల్లె, కురబలకోట, ముదివేడు, అంగళ్లు, పోతబోలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రికార్డు గదిలో మొత్తం ఎన్ని ఫైళ్లు ఉన్నాయి? ఎన్ని రోజులుగా.. ఏయే రికార్డులు ఉన్నాయి? ప్రస్తుతం అవి సక్రమంగా ఉన్నాయా? అందులో ఏవైనా కనిపించకుండా పోయాయా? అని అక్కడ ఉన్న రికార్డు అసిస్టెంటును అడిగి తెలుసుకున్నారు.



సీఐడీ పోలీసులు తనిఖీ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఫిర్యాదులపై ఆరా

ఫైళ్ల దగ్ధం సంఘటన తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై బాధితులు స్వయంగా రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ప్రిన్సిపల్ కార్యదర్శి సిసోడియాకు ఫిర్యాదులు చేశారు. తమ భూములు ఆక్రమించుకున్నారని, దౌర్జన్యం చేశారని, ఫోర్జరీ పత్రాలతో తమ ఆస్తులు కాజేశారని, విలువైన ఆస్తులను తక్కువ ధరలకే లాక్కున్నారని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు ప్రాంతాలకు చెందిన పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సీఐడీ పోలీసులు ఈ ఫిర్యాదులపైనా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

గృహాలకు జియో ట్యాగ్ పూర్తి చేయాలి

● అపార్ ఐడీ త్వరితగతిన జనరేట్ చేయండి ● కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే మూడు రోజుల్లో జిల్లాలోని 5.48 లక్షల గృహాలను సచివాలయ సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన జియో ట్యాగ్ పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంపీడీవోలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, డ్వామా ఏపీడీలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ, సిబ్బంది. పంచాయతీ కార్యదర్శులు తదితరులతో వివిధ అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో మూడు రోజుల్లోపు మంజూరైన ప్రతి గృహంతో పాటు వాటి ఇంటి నెంబర్లు జియో ట్యాగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. నవశకం పథకానికి సంబంధించి ఎన్పీసీఎల్ ఇన్ ఆక్టివ్ ఉన్న లబ్ధిదారులందరికీ బ్యాంకు అకౌంట్లకు తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ చేయించాలని సూచించారు. ఇందుకు సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. పల్లె పండుగలో చేపట్టిన పనులు వందశాతం గ్రౌండ్ పూర్తి కావాలని, ఎక్కడైనా చిన్న చిన్న కారణాలతో ఇంకా గ్రౌండ్ కాకపోతే వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ విషయంలో అశ్రద్ధ, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు అపార్ ఐడీ త్వరితగతిన జనరేట్ చేయాలని, పంచాయతీ సెక్రటరీలు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ప్రతి స్కూల్‌ను సందర్శించి ఎంతమందికి అపార్ ఐడీ ఉంది ఎంతమందికి లేదని పరిశీలించి ఐడీ లేని వారందరికీ ఐడీ క్రియేట్ చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను విరివిగా కల్పించాలన్నారు. కొన్ని గ్రామాల్లో కూలీల నమోదు శాతం చాలా తక్కువగా ఉందని, ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా పెంచాలన్నారు. వీసీలో డ్వామా పీడీ వెంకటరత్నం, పీఆర్ఎస్ఈ దయాకర్‌రెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, ఎంపీడీవోలు, ఏపీడీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపార్‌కు ఆమోదం కష్టాలు..!

● సేవల ఆమోదానికి నిరీక్షణ..!

● ఆధార్ సెంటర్లలో నమోదైనా.. హోల్డ్‌లోనే

● వార్డు, గ్రామ సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి

● క్యూ కడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

6



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలోని ఆధార్ కేంద్రం వద్ద జనాల రద్దీ

బాల్ బ్యాడ్మింటన్ పండగ

● ములకలచెరువులో రాష్ట్ర స్థాయి అండర్-14 పోటీలు ప్రారంభం

● తరలివచ్చిన 13 జిల్లాల క్రీడాకారులు

● చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

● టీడీపీ నేత జయచంద్రారెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువుకు బాల్ బ్యాడ్మింటన్ పండగ వచ్చింది. స్థానిక ఇండెన్ గ్యాస్ కార్యాలయం సమీపంలో ఉన్న మైదానంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చారు. బాలురు, బాలికల విభాగాలకు సంబంధించి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనరెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులతో పాటు కొంతసేపు సరదాగా బాల్‌బ్యాడ్మింటన్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు తన ఆధ్వర్యంలో జరగడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత, సీఐ రాజారమేష్, తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు గంగాదేవి, భజంత్రి రామాంజులు, ఎండీ మస్తాన్, అయూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నాలుగు విభాగాలుగా జట్ల విభజన

బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల బాలురు, బాలికల జట్లను నాలుగు విభాగాలుగా విభజించారు. బాలుర విభాగం ఏ-పూల్‌లో చిత్తూరు, విశాఖపట్నం, ప్రకాశం, బీ-పూల్‌లో శ్రీకాకుళం, అనంతపురం, వెస్ట్ గోదావరి, సీ-పూల్‌లో ఈస్ట్ గోదావరి, కడప, గుంటూరు, డీ-పూల్‌లో కర్నూలు, క్రిష్ణా, నెల్లూరు, విజయనగరం జట్లు ఉన్నాయి. అలాగే బాలికల విభాగంలో ఏ-పూల్‌లో శ్రీకాకుళం, చిత్తూరు, గుంటూరు, బీ-పూల్‌లో ఈస్ట్ గోదావరి, నెల్లూరు, కర్నూలు, సీ-పూల్‌లో విశాఖపట్నం, విజయనగరం, అనంతపురం, డీ-పూల్‌లో క్రిష్ణా, వెస్ట్ గోదావరి, కడప, ప్రకాశం జిల్లాలు ఉన్నాయి. లీగ్ దశలో ఒక్కో గ్రూప్‌లో ఒక్కో జట్టు రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. మ్యాచ్‌ల్లో గెలిచి మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుతాయి. మూడవ స్థానంలో నిలిచిన జట్లు ఇంటిదారి పడతాయి. కాగా మొదటిరోజు జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో విశాఖపై చిత్తూరు, నెల్లూరుపై కర్నూలు, అనంతపురంపై శ్రీకాకుళం, ప్రకాశంపై చిత్తూరు, వెస్ట్‌గోదావరిపై శ్రీకాకుళం, ప్రకాశంపై విశాఖపట్నం, కర్నూలుపై విజయనగరం, కృష్ణాపై నెల్లూరు, వెస్ట్‌గోదావరిపై అనంతపురం జట్టు విజయం సాధించాయి. బాలికల విభాగంలో వెస్ట్ గోదావరిపై కడప, ప్రకాశంపై కృష్ణా, విజయనగరంపై అనంతపురం, కడపపై కృష్ణా, ఈస్ట్ గోదావరిపై కర్నూలు, గుంటూరుపై శ్రీకాకుళం, వెస్ట్ గోదావరిపై ప్రకాశం జట్లు విజయం సాధించాయి.



పోటీలలో తలపడుతున్న ప్రకాశం - కృష్ణా జిల్లాల బాలికల జట్లు

దర్జాగా అమ్మేశారు..

● నకిలీ సీళ్లతో ప్రభుత్వ భూమికి రెవెన్యూ పట్టా

● రూ.లక్షల్లో అక్రమ వసూళ్లు



అమ్మచెరువు మిట్ట వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమ ఇంటి నిర్మాణాలు

కురబలకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల దౌర్జన్యాలను అడిగే నాథుడే లేకపోవడంతో వాళ్ల ఆడిందే ఆట...పాడిందే పాట చందంగా సాగింది. అప్పుడు జరిగిన అవినీతి భూబాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండల పరిధిలో పలుచోట్ల చెరువులు, వంకలు, వాగులను అధికార నేతలు ఆక్రమించుకుని సొమ్ము చేసుకున్నారు. కాగా జాతీయ రహదారి పక్కనున్న భూములను ఆక్రమించుకుని నకిలీ పట్టాలు సృష్టించి ఇష్టానుసారంగా అమ్మేసి భారీ మొత్తంలో సొమ్ము చేసుకున్నారు. దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన పలువురు అధికారులను బెదిరించి మరీ తమ పని చేసేసుకున్నారు. కురబలకోట మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి భూబాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అనంతపురం-మదనపల్లె జాతీయ రహదారి రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రభుత్వం భూమి సేకరించింది. మండల పరిధిలో కురబలకోట, తెట్టు, అంగళ్లు పంచాయతీల మీదుగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాగా మండల పరిధిలో అమ్మచెరువు మిట్ట ప్రాంతం మదనపల్లె శివార్లలో ఉంటుంది. దీంతో ఈ ప్రాంతంలో భూముల ధరలు కోట్లలో పలుకుతున్నాయి. అయితే గతంలో అంగళ్లు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు-628, తెట్టు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు-859లో కొంతమంది పేదలకు పట్టాలు ఇచ్చారు. అయితే ఆ స్థలంలో కొంతమంది నిర్మాణాలు చేపట్టగా చాలామంది నిర్మాణాలు చేపట్టలేదు. ఈ ప్రాంతంలో జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈ భూముల విలువ విపరీతంగా పెరిగిపోయింది. నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉన్న స్థలాలపై వైసీపీ నేతలు కన్ను వేసి రోడ్డు పక్కన ఉన్న ఎంతో విలువైన భూమిని ఆక్రమించుకున్నారు. గతంలో భూమికి సంబంధించి పట్టాలు పొందిన వారి నుంచి తమకు ఎప్పుడైనా ఇబ్బంది వస్తుందని పసిగట్టి నకిలీ రెవెన్యూ సీళ్లతో నకిలీ పట్టాలను సృష్టించారు. దాదాపుగా 40 మందికి పైగా పట్టా ఒక్కొక్కటి రూ.10 లక్షల వరకు అమ్మకాలు చేపట్టారు. దీనిని కొనుగోలు చేసిన వ్యక్తులు రాత్రి, పగలు తేడా లేకుండా నిర్మాణాలను చేపట్టారు. గతంలో ఇక్కడ పట్టాలు పొందిన వారు అక్కడికి వెళ్లి అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారిపైనే దాడులకు పాల్పడ్డారు. దీంతో చాలామంది అప్పట్లో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. కొంతమంది రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు తమ వంతు సహాయ సహకారాలు అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిత్యం ఈ మార్గంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు ప్రయాణిస్తున్నా అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

> **విచారణ చేసి నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తాం..**
>
> మండలంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఆక్రమణకు గురైన స్థలాలకు సంబంధించి భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంటాం. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రద్దు చేస్తాము. అలాగే పట్టాలు పొందిన వారు తమ పట్టాలతో తమ సిబ్బందిని కలిసి వాటిపై నిజానిజాలు తెలుసుకోవాలి.
>
> - తపశ్విని, తహసీల్దార్

ప్రభుత్వం మారినా పట్టించుకోలేదు..

మదనపల్లె పట్టణ శివార్లలో జరిగిన ఆక్రమణలు బహిరంగ రహస్యమే. అక్కడ వైసీపీ నేతలు ఎన్నికలకు ముందు అమాయకులకు భూమిని అమ్మి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. అయితే ప్రభుత్వం మారితే తమకు న్యాయం జరుగుతుందని అసలు పట్టాదారులు నమ్మకంతో ఉన్నారు. అయితే ప్రభుత్వం మారినా వాటికి సంబంధించి ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారించాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని పూర్వపు స్థితికి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

పెనగలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ప్రభుత్వ సిబ్బంది ప్రత్యేక చొరవ కనబర చాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఆయన మండల పరిషత్ సభాభవనంలో అభివృద్ధి పనులపై ప్రభుత్వ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆయన శాఖల వారీగా ప్రగతిని తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, రెవెన్యూ సమస్యలపై వాకబు చేశారు. ఉచిత ఇసుక రవాణా గురించి ఆరా తీశారు. గృహనిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం సిద్దవరం గ్రామానికి చెందిన న్యాయవాది గోపిగారి రెడ్డెయ్య, సింగమల సర్పంచ్ ఎర్రి శివయ్య తదితరులు సిద్దవరం గ్రామ పరిధిలో జరిగిన పలు భూఆక్రమణల గురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇండ్లూరు, కొత్తపల్లె గ్రామాలకు చెందిన ముస్లింలు నూర్‌బాషా, దూదేకుల సంఘం సభ్యులు గ్రామంలో ఉన్న ఒక మసీదుకు అనుసంధానంగా ఈద్గా ఒకటి ఉందని, గ్రామంలోని ఒక వ్యక్తి ఇంకో ఈద్గాను నిర్మించాలని చూస్తున్నారని, దానిని నిలుపుదల చేయాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ డిప్యూటీ కలెక్టర్ శివజ్యోతిని విచారణకు ఆదేశించారు. కొత్తపల్లెలోని జామియా మసీదు ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల ద్వారా స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ నారాయణనెల్లూరు, కోమంతరాజాపురం ఇసుక క్వారీలను తనిఖీ చేశారు.

అపార్‌కు ఆమోదం కష్టాలు..!!

● సేవల ఆమోదానికి నిరీక్షణ..!

● ఆధార్ సెంటర్లలో నమోదైనా.. హోల్డ్‌లోనే

● వార్డు, గ్రామ సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి

● క్యూ కడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలోని ఆధార్ సెంటర్ వద్ద జనాల రద్దీ

మదనపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న ఒకే దేశం.. ఒకే విద్యార్థి అనే నినాదంతో అపార్ ఐడీని కేటాయిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆధార్ తరహాలో 12 అంకెల నెంబర్‌ను కేటాయించనున్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, వారి ఆధార్ కార్డుల్లో వివరాలు ఒకే విధంగా ఉండాలన్నది నిబంధన. వీటిని సరిపోల్చితే, విద్యార్థుల వివరాల్లో 50 శాతానికిపైగా తప్పులు, పొరపాట్లు చోటు చేసుకున్నాయి. తప్పుల తడకగా ఉన్న విద్యా సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ సెంటర్లకు ప్రస్తుతం క్యూ కడుతున్నారు. ఇక్కడా వీరు తెచ్చే వివరాలు సరిపోలకపోవడంతో వారంతా మరోసారి విద్యాసంస్థలు, మున్సిపల్, పంచాయతీ, సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. జనన ధ్రువీకరణ పత్రం, అందులోని సంవత్సరం, తేదీలో కరెక్షన్, పేరు మొదట్లో ఇన్షియల్ కాకుండా సర్‌నేమ్ ఉండేలా దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. ఇలా అటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇటు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ఆధార్ సెంటర్‌లో ఒకరోజులో పని అవుతుండగా, రికార్డులు, ఆధార్‌లలో తప్పొప్పులు ఉంటే మూడు, నాలుగు రోజులు పడుతోంది. దీంతో విద్యార్థులు అటు స్కూల్స్‌కు వెళ్లలేక, వారి తల్లిదండ్రులు పనులు వదులుకుని అటు ఆధార్, ఇటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పోనీ ఇన్నీ అయినా.. ఆధార్‌లో సవరణలు పూర్తయ్యాక వెంటనే పని అవుతుందా? అంటే అదీ లేదు. ఆధార్ మెయిన్ సర్వర్‌లో యాక్టివ్ కావడానికి నెలా, నెలన్నర సమయం పడుతోంది. నెలన్నరరోజుల క్రితం వరకూ నాలుగు నుంచి వారం రోజుల్లో పూర్తయిన ప్రక్రియ, ప్రస్తుతం నెలరోజులకు పైగా పడుతోందని చెబుతున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ సెంటర్, వార్డు, గ్రామ సచివాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లోని ఆధార్ సెంటర్లకు తిరుగుతున్నారు. ఎప్పుడు యాక్టివ్ అవుతుందని, సరిచేసిన పత్రాలు తమకు ఎప్పుడు అందుతాయని వారు నిరీక్షిస్తున్నారు. ఆయా సెంటర్లలో స్టేటస్ చూస్తే సర్వీస్ ఆన్ హోల్డ్ అని, యాక్టివేషన్ పెండింగ్ అని చూపెడుతోంది. మరోవైపు సరైన ధ్రువపత్రాలు సమర్పించని వారి సేవలు చాలా వరకూ రిజెక్ట్ అవుతున్నాయి. ఆ సమాచారం తెలియడానికి కూడా ఇంతే సమయం పడుతుండగా, అలాంటి వారంతా తిరిగి ఆధార్ గడప తొక్కాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్‌లలో మొత్తం వంద వార్డు, గ్రామ ఆధార్‌సెంటర్లు ఉన్నాయి. జిల్లాలోని అయిదు సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయంలో మూడు విడతలుగా 2022 నుంచి వీటిని ఏర్పాటు చేశారు. సచివాలయంలో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ వీటిని ఆపరేట్ చేస్తున్నారు. ఇందులో కొత్త ఆధార్‌తో పాటు ఆధార్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్స్, డేట్ ఆఫ్ బర్త్, సర్‌నేమ్‌తో సహా సవరణలు చేస్తున్నారు. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటి నుంచీ రోజుకు సగటున ఒక్కో కేంద్రంలో పది సర్వీసులు వస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవి కూడా నాలుగైదు రోజుల్లో ఆమోదం అయ్యేవి. కానీ ప్రస్తుతం నెల, నెలన్నరరోజులుగా ఆ పరిస్థితి లేదు. సేవలన్నీ ఆన్‌హోల్డ్ అని చూపెడుతోంది. వీటిపై డిజిటల్ అసిస్టెంట్స్ ఎప్పటికప్పుడు టెక్నికల్ సిబ్బంది, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమాధానం లేదని చెబుతున్నారు. అయితే సచివాలయాలు, ఆధార్ సెంటర్లకు వచ్చే బాధితులకు ఏమని సమాధానం చెప్పాలని వారు వాపోతున్నారు. సరైన సమాచారం లేక వారు తలపట్టుకుంటున్నారు. ఇదిలా వుండగా మదనపల్లె మున్సిపాలిటీలో మొత్తం 44 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో అమ్మచెరువుమిట్ట, రామిరెడ్డిలేఅవుట్, అమ్మినేనివీధి, గొల్లపల్లె, రామారావు కాలనీ, సుభాష్ రోడ్డు, బాకవానితోట, నెహ్రూబజార్, వడ్డిపల్లె సచివాలయాల్లో అనుసంధానంగా ఆధార్ సెంటర్లు ఉన్నాయి. ఇలా జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాలే కాదు.. మీ-సేవా కేంద్రాలలో, బ్యాంకులు, పోస్టాఫీసులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలలో ఇలా సుమారు 360 ఆధార్‌కేంద్రాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో ఆయా ఏజెన్సీల పరిధిలో సర్వీసులు నడుస్తున్నాయి.



జననధ్రువీకరణ పత్రంలో మార్పులకోసం మున్సిపల్ కార్యాలయంలో క్యూ కట్టిన ప్రజలు

వారు అలా.. వీరు ఇలా..

అపార్ ఐడీలో భాగంగా ఆధార్‌లో మార్పులు, చేర్పులకు స్టడీ సర్టిఫికెట్ పెట్టి మార్చుకుని రమ్మని విద్యాసంస్థలు చెబుతుండగా, దాని ఆధారంగా ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసే అవకాశం లేదని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. ఒక వేళ ఆ విధంగా చేసినా రిజెక్ట్ అవుతున్నాయి. బర్త్ సర్టిఫికెట్ లేదా పదో తరగతి మార్కుల లిస్టు మాత్రమే తీసుకుంటున్నారు. నేమ్ కరెక్షన్‌కు 18 ఏళ్ల లోపు ఉన్న వారికి జనన ధ్రువీకరణ పత్రం, ఆపైన ఉన్న వారికి మార్కులలిస్టు పెడుతూ, తల్లి లేదా తండ్రి ఫింగర్ ప్రింట్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆధార్ కార్డులో తల్లిదండ్రుల పేరులో ఏమాత్రం తేడా ఉన్నా తీసుకోవడం లేదు. ఇవన్నీ సక్రమంగా ఉంటేనే ఆధార్‌లో సవరణ ప్రక్రియ జరుగుతోంది. తర్వాత జరిగే ఆమోదంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతంలో నాలుగురోజుల్లో ఆమోదం పొందే సేవలు ప్రస్తుతం నెల, నెలన్నర సమయం తీసుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. మధ్యలో సర్వీసును చెక్ చేస్తే అండర్ ప్రాసెస్, ఆన్ హోల్డ్ అని చూపెడుతోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాధానం చెప్పలేని నిర్వాహకులు ఆధార్‌లో ఒకసారి మార్పు చేస్తే 90 రోజుల్లో ఎప్పుడైనా ఆమోదం కావచ్చని చెప్పి పంపుతున్నారు.

యువకుడి దారుణ హత్య



సంఘటనా స్థలం వద్ద పోలీసు జాగిలంతో సిబ్బంది



హత్యకు గురైన వెంకటనారాయణ

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని చౌడవరం చెరువు కట్ట సమీపం చియ్యవరం గ్రామానికి వెళ్లే దారిలో బుధవారం ఓ యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి దారుణంగా హత్య చేశారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని ఉర్లగట్టుపోడు గ్రామానికి చెందిన పిటాని వెంకటనారాయణ (39) నియోజకవర్గంలో టైల్స్ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఈయన ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట గ్రామంలో ఒక అమ్మాయితో సహజీవనం చేస్తున్నాడని, హత్యకు ఇదే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించి కత్తులతో మెడ వద్ద పొడిచినట్లు ఆనవాళ్లు ఉన్నాయని, అక్కడికక్కడే మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. సంఘటన సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరావు, ఎస్ఐ నవీన్‌బాబు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే పోలీసు జాగిలం వచ్చి పరిశీలించింది. హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. శవాన్ని శవపరీక్ష నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. అయితే వెంకటనారాయణ స్వగ్రామం వెస్ట్ గోదావరి అని తెలిసింది. రైల్వేకోడూరు మండలంలోని ఉర్లగట్టుపోడు అడ్రస్‌కు ఆధార్ కార్డును మార్పు చేసుకున్నాడు. మృతుడి స్వగ్రామ పరిధి పోలీస్‌స్టేషన్‌లో వెంకటనారాయణ మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు ఉందని తెలిసింది. వీటన్నింటిపై పోలీసులు విచారిస్తున్నారు.

కుక్కర్ పేలి మహిళకు తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ అమీరున్

పెద్దతిప్పసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుక్కర్ పేలి ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు మండలంలోని రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెకు చెందిన ఓ నిరుపేద సిద్దయ్య భార్య అమీరున్ ఇటీవల ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కుక్కర్ పేలడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేక నాలుగు రోజుల నుంచి ఇంటివద్దే ప్రథమ చికిత్స చేయించుకుంటూ ఉండేది. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు నగదు పోగుచేసి బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి బుధవారం కొంత ఆర్థికసాయం చేసి మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీంతోపాటు గాయాలు నయం అయ్యేంత వరకు అయ్యే ఖర్చు తాము భరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలే అమీరున్ భర్తకు ఆరోగ్యం సరిగా లేక అప్పులు చేసి పలు ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. ఇప్పుడు ఈమెకు ఇలా జరగడంతో ఆ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. కాగా బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేసిన యువకులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మదనపల్లెలో ప్రకాశం జిల్లా వాసి మృతి



మృతి చెందిన నజీర్ అహ్మద్

మదనపల్లెఅర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన వృద్ధుడు బుధవారం మదనపల్లెలో మృతి చెందినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. సింగరాయకొండ సెల్‌టవర్ వీధిలో నివాసం ఉండే నజీర్ అహ్మద్(66) మదనపల్లెలో ఉండే బంధువుల ఇంటికి సొంత పనినిమిత్తం వచ్చాడు. అనంతరం తిరిగి సొంతూరుకు వెళ్తుండగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్నపలంగా కిందపడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

పెన్నానదిలో పడిన బాలుడి మృతదేహం లభ్యం



మణికంఠ (ఫైల్)

కడప క్రైం/సిద్దవటం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధి మృత్యుంజయకుంటలో నివసించే మణికంఠ (16)అనే బాలుడి మృతదేహం ఎట్టకేలకు పెన్నానదిలో బుధవారం లభ్యమైంది. వాటర్ గండి సమీపంలో నవంబరు 3న స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. బాలుడు కనిపించకపోవడంతో బాలుడి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నచౌకు పోలీసులు ఈ నెల 4న మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఈ క్రమంలో గాలింపు చర్యలు చేపట్టగా పెన్నానదిలో బాలుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

టమోటాకు వాతావరణ ఆధారిత ఇన్సూరెన్సు

● జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రవిచంద్రబాబు



ఇన్సూరెన్స్ గురించి వివరిస్తున్న డీహెచ్‌వో రవిచంద్రబాబు

కలికిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే టమోట పంటకు ఇన్సూరెన్సు సౌకర్యం అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రవిచంద్రబాబు వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 మధ్య సాగు చేసే పంటకు ఈ ఇన్సూరెన్సు వర్తిస్తుందని ఆయన చెప్పారు. పీలేరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన సచివాలయాల ఉద్యాన సహాయకులకు, శాస్త్రవేత్తలకు టమోట పంటకున్న ఇన్సూరెన్సు గురించి స్థానిక కేవీకేలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉద్యానశాఖ పరిధిలో నాలుగు వేల ఎకరాల సాగుతో టమోట పంట రెండవ స్థానంలో వుందని చెప్పారు. రబీ సీజన్‌లో సాగయ్యే టమోట పంటకు వాతావరణ ప్రతికూలతల కారణంగా నష్టం వాటిల్లితే ఇన్సూరెన్సు వర్తిస్తుందని హామీ ఇచ్చారు. రైతులు ఎకరాకు రూ.1600 ప్రీమియం చెల్లించాల్సి వుందని, అదే సమయంలో పంటకు నష్టం వాటిల్లితే రూ.32 వేలు పరిహారంగా వస్తుందని తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో కూడా ప్రీమియం చెల్లించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. భూమికి సంబంధించిన 1బి, ఆధార్, బ్యాంక్ అకౌంటు, పంట ధ్రువీకరణలు సమర్పిస్తే చాలని వివరించారు. ఇన్సూరెన్సు కోసం జిల్లాకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా ఉద్యాన సహాయకులు రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. కేవీకే కోఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను వాడుతూ పసుపు, బులుగు రంగుల జిగురు అట్టలు అమర్చడం ద్వారా ఉద్యాన పంటల్లో తెగుళ్లు నివారించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో పీలేరు, వాల్మీకిపురం ఉద్యాన అధికారులు టి.సుకుమార్‌రెడ్డి, ఇ.ఈశ్వర్‌ప్రసాద్ రెడ్డి, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాస్, కలికిరి, కలకడ, కేవీ పల్లె, గుర్రంకొండ, పీలేరు మండలాల్లోని ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడాలి

- డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌తో కార్మిక నాయకుల చర్చలు



లేబర్ అధికారులతో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ఓబులవారిపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ సంస్థ నందు పనిచేస్తున్న కార్మికుల హక్కులను కాపాడా లని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కార్మిక పోరాట సమితి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాదులోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ వెంకటేశ్, తదితరులు మాట్లాడారు. ఏపీఎండీసీ యాజమాన్యం అనేక రోజులుగా కార్మికుల సమస్యలపై కాలయాపన చేస్తూ పరిష్కారం చేయలేదన్నారు. అంతే కాకుండా 2021-22కు సంబంధించి కార్మికులకు బోనస్ తక్కువగా ఇచ్చారని, పెండింగ్ మెడికల్ బిల్లులు హెల్త్ ఇండియా కంపెనీ రూ.25 లక్షలు ఎగ్గొట్టి వెళ్లిందని ఆరోపించారు. ఆ మొత్తాన్ని ఏపీఎండీసీ యాజమాన్యం ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో హెల్త్ ఇండియా వారితో మాట్లాడి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అదేవిధంగా చనిపోయిన 7 మంది కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల డెత్ ఇన్సూరెన్స్ ఇవ్వలేదని, చనిపోయినా, పదవీ విరమణ పొందినా, ఔట్ సోర్సింగ్ ట్రైనీ కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని తెలిపారు. అన్ని సమస్యలు కచ్చితంగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ చర్చల్లో ఏపీఎండీసీ అడిషనల్ జనరల్ మేనేజర్ జోసెఫ్, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మహేష్ సెట్టికర్, పోరాట కమిటీ నాయకులు సుబ్రమణ్యం, గోవిందు, వెంకటేశ్, ఈశ్వరప్ప, చంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

ట్రంప్ విజయం పట్ల సతీశ్ వేమన హర్షం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సతీశ్ వేమన (ఫైల్)

రాజంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీశ్ వేమన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొద్ది నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల నిరీక్షణకు తెరదించుతూ అమెరికా సంయుక్త రాష్ట్రాల 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నో మలుపుల మధ్య గత కొద్ది నెలలుగా హోరాహోరీగా ప్రచారం సాగించి ఎట్టకేలకు విజయం సాధించారని, ఈ విజయం వెనుక భారతీయ ప్రముఖుల కృషి ఉందన్నారు. తెలుగు వారు అత్యధికంగా ఉన్న తూర్పు రాష్ట్రాల్లో ట్రంప్ ప్రతినిధులతో కలిసి తాను సంవత్సరకాలం పాటు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. కాగా భారత, అమెరికా సంబంధాలు ఎప్పటిలాగే సుహృద్భావ వాతావరణంలో, సోదరభావంతో కొనసాగుతాయని ఆశిస్తున్నానని, తద్వారా ఇరుదేశాల అభివృద్ధి, యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడపక్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దేవునికడప ఆర్చి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పాతకడపకు చెందిన వెన్నపూస రామసుబ్బారెడ్డి (55) పనిమీద బైపాస్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన తుఫాను వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాయ్యాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గంగప్ప

పెద్దమండ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దమండ్యం మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎన్నోపల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన గంగప్ప(50) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని కోటగాడపల్లెకు సొంత పనుల నిమిత్తం టీవీఎస్‌లో వెళ్తుండగా ఆటో వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గంగప్ప అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ వీవీ రమణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా విజిలెన్స్ కమిటీలో పీలేరు వాసులు



శ్రీనివాసులు, బోదేషావలి

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో పీలేరుకు చెందిన ఇద్దరికి స్థానం దక్కింది. భారతీయ అంబేడ్కర్ సేన నాయకుడు పాలకుంట శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలిని సభ్యులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వారిద్దరికీ బుధవారం నియమాకపత్రాలు అందాయి. విజిలెన్స్ కమిటీలో స్థానం దక్కించుకున్న వారిద్దరినీ పలువురు అభినందించారు.

రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వెంటనే రద్దు చేయాలి

● యూటీఎఫ్, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ ద్వారా ఉపాధ్యాయులకు అందిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదాశివరెడ్డి, ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ వేర్వేరుగా విలేఖరులతో మాట్లాడారు. లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగుల పేరుతో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, ఎంఈవోలను తమ సమీప ప్రాంతాల్లో కాకుండా దూర ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉన్న శిక్షణా కేంద్రాల్లో ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో ఉండాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు కడపలో అరకొర వసతులు ఉన్న శిక్షణ కేంద్రంలో శిక్షణ ఏర్పాటు చేశారన్నారు. 50 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులు శిక్షణ తీసుకోవడం కష్టతరంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు దృష్టిలో పెట్టుకుని ఆ శిక్షణను మండల కేంద్రాల్లో నిర్వహించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శిక్షగా మారిన శిక్షణను ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదని, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ జోక్యం చేసుకుని దీన్ని రద్దు చేయాలన్నారు.

సైబర్ కేటుగాళ్లు పొంచి ఉన్నారు..

- ఆన్‌లైన్ సేవల వినియోగంలో తొందరపాటు వద్దు
- కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలు
- అప్రమత్తంగా లేకపోతే ఖాతాలో డబ్బు ఖాళీనే



కడప క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్నాయి. మోసపోయేవారు ఉన్నంత వరకు మోసం చేసే వారు పుడుతూనే ఉంటారు. ఈజీ మనీ కోసం కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. నెట్ ఉపయోగించి ఎన్ని రకాలు కావాలంటే అన్ని రకాల మోసాలకు పాల్పడుతున్నారు. వీరి ఉచ్చులో పడితే సర్వం దోచేస్తారు. నార్త్ రాష్ట్రాల సైబర్ నేరగాళ్లు (ఆడవాళ్లు) తియ్యటి మాటలతో బుట్టలో వేసుకుంటారు. మాయమాటలు చెప్పి ఖాతా వివరాలు తెలుసుకుని డబ్బులను దోచుకుంటున్నారు. మరికొందరు వీడియో కాల్.. లోన్ యాప్ వంటి రకరకాల పద్ధతులలో మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి మోసాలన్నీ తెలిసీ మరీ మనం మోసపోతూనే ఉన్నారు.

ఇటీవల కడపకు చెందిన ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌కు ఒక లింకు రావడంతో దాన్ని క్లిక్ చేశాడు. అంతే అతని ఖాతాలో ఉన్న డబ్బులన్నీ దోచేశారు. ఉద్యోగం పేరుతో ఓ మహిళ నుంచి లక్షలు కాజేశారు. ఓ విశ్రాంత ఉద్యోగికి అయితే వీడియో కాల్ చేసి నగ్నంగా ఉన్న చిత్రాలు గ్రూపులో పెడతానంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి అతని వద్ద లక్షలు దోచేశారు. ఇక ఈకేవైసీ, స్కానర్ లాంటి వాటి అధారంగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఎక్కడో ఒక చోట చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొత్త కొత్త పద్ధతుల్లో సైబర్ నేరగాళ్ల మోసాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

లోన్ యాప్‌లతో తస్మాత్ జాగ్రత్త

డబ్బు అవసరం ఉందని లోన్ యాప్‌ను ఆచరించారా అంతే సంగతులు. తీసుకున్న డబ్బు కంటే పదింతల రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. డబ్బు చెల్లిస్తున్నా కొత్త కొత్త నెంబర్లతో ఫోన్లు చేసి వారిని మానసికంగా శారీరకంగా హింసకు గురి చేయడంతో పాటు డబ్బు ఇవ్వకపోతే నగ్నంగా ఉన్న మీ ఫొటోలను మీ కాంటాక్ట్ నెంబర్లకు పోస్టు చేస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ డబ్బులు దోచుకుంటున్నారు. మోసపోయిన బాధితులు కొందరు పోలీసులను ఆశ్రయిస్తే.. మరికొందరు బయటకు చెప్పుకోలేక నిమ్మకుండిపోతున్నారు. ఏది ఏమైనా లోన్ యాప్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

బ్యాంకు అధికారులమంటూ ఫోన్లు చేస్తే నమ్మవద్దు

మీ బ్యాంకు ఖాతా క్లోజ్ చేస్తున్నామని... మీ అకౌంటు వివరాలు చెప్పాలని ఎవరైనా ఫోను చేస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దు. ఏ బ్యాంకు అధికారులు కూడా మీకు ఫోను చేయరు. అలాంటి వారి మాటలు నమ్మి మీ అకౌంటు వివరాలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పకపోవడమే మంచిది.

ఈకేవైసీ ఆధార్ వివరాలు చెప్పవద్దు

ఏఈపీఎస్ వినియోగిస్తున్న కస్టమర్ల పూర్తి వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరిస్తుంటారు. కొంతమంది బ్యాంకులకు వెళ్లలేక పదివేల లోపు డబ్బు కోసం ఏఈపీఎస్ వినియోగిస్తున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు మన వేలిముద్రలను సేకరించి మన ప్రమేయం లేకుండానే ఈజీగా డబ్బులు కాజేస్తున్నారు. ఖాతాదారులు బ్యాంకులకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకోవడమే మంచిది.

ఏటీఎం సెంటర్ల వద్ద ఏమరుపాటు వద్దు

ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏటీఎం మెషిన్‌లో కార్డు పెట్టి సీక్రెట్ నెంబరు కొట్టేటప్పుడు ఎవరికీ కనిపించకుండా వినియోగించడం మంచిది. ఏటీఎం వినియోగించడం చేతకాని వారు తెలిసిన వ్యక్తుల ద్వారా డబ్బులు డ్రా చేసుకోవాలి తప్ప కొత్త వ్యక్తులను నమ్మి వారికి కార్డులు ఇవ్వడం మంచిది కాదు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులలో నేరాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగిస్తున్నా రని.. ప్రతీది ఆన్‌లైన్ ద్వారానే కొనుగోలు చేసి డబ్బుల చెల్లింపులు చేస్తున్నారు. ఈవిషయంలో అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకుకు సం బంధించిన ఖాతాలు, వ్యక్తిగత వివ రాలను ఇతరులకు తెలియపరచకపోవడమే మంచిది. సెల్‌ఫోన్‌లోకి వచ్చే లింకులకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ సెల్ సీఐ

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం



రక్తదాన శిబిరంలో విద్యార్థికి పండ్ల రసం ఇస్తున్న వీసీ, ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరానికి విద్యార్థులు, అధ్యాపకుల నుంచి మంచి స్పందన లభించింది. వైవీయూ డీఓఏ కార్యాలయంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వీసీ క్రిష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని బతికించిన వారవుతారని అన్నారు. ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ ఆరు మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓ వెంకట రామిరెడ్డి మాట్లాడారు. వైవీయూ ఆరోగ్య కేంద్రం డాక్టర్ నరేశ్, రెడ్‌క్రాస్ సంస్థ వైద్యాధికారి ఎస్ఎస్‌వీ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు.

విద్యాదాత ఝాన్సీలక్ష్మీబాయి



సంబరాలు చేసుకుంటున్న శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తదితరులు

సికెదిన్నె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి ఎంతో మందికి విద్యను అందించిన విద్యాదాత అని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ రమణయ్య తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో చైర్‌పర్సన్ ఝాన్సీలక్ష్మీబాయి 76వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు స్థాపించి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పించి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విద్యాసంస్థల్లో రక్తదానం ఏర్పాటు చేసి 60 మందికిపైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రిమ్స్ డాక్టర్ రాజేంద్ర, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు
శ్లోకాశ్రీ, రమ్యశ్రీలు ఎంపిక

ముగిసిన ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు



బ్యాడ్మింటన్ జాతీయజట్టుకు ఎంపికైన బాలబాలికలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జికారోనేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. బుధవారం బాలబాలికలకు వ్యక్తిగత విభాగంలో పోటీలు నిర్వహించి ఐదుగురు క్రీడాకారులను జాతీయజట్టుకు ఎంపిక చేశారు. బాలికల విభాగంలో కడపజిల్లా నుంచి ఇద్దరు బాలికలు శ్లోకాశ్రీ, రమ్యశ్రీలు జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 17వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి జిలానీబాష, అబ్జర్వర్ శ్రీనివాసరావు, అరుణ, విజయప్రసాద్‌రెడ్డిలు అభినందించారు.

జాతీయ జట్టుకు ఎంపికైన బాలుర జట్టు : చరణ్‌రామ్, ప్రవణ్‌సాయి (చిత్తూరు), పార్థీవ్ (వైజాగ్), తరుణ్ (కర్నూలు), తిలోక్ (పశ్చిమ గోదావరి). బాలికల జట్టు : శ్రావణి (వైజాగ్), భవితశ్రీ (కర్నూలు), శ్లోకాశ్రీ, రమ్యశ్రీ (కడప), లహరి (వైజాగ్).

పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు : జేసీ



గండికోట నిర్వాసితులతో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గండికోట పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. బుధవారం సాయింత్రం కడపలోని తన చాంబర్‌లో గండికోట నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పునరావాస కాలనీల్లో గత ప్రభుత్వం హయంలో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు శ్మశానవాటికలు వంటి మౌలిక సదుపాయాలు అసంపూర్తిగా ఉన్నాయని నిర్వాసితులు జేసీకి వివరించారు. ఎంతమేరకు పనులు చేపట్టారు, అసంపూర్తిగా ఉన్న వాటికి ఎంత నిధులు అవసరమవుతయో తెలపాలని పక్కనే ఉన్న ఇంజనీరింగ్ అధికారులను జేసీ ఆదేశించారు. పునరావాస పరిహారం కింద మొదటివిడత 14 ముంపు గ్రామాలకు అదనపు పరిహారం రూ.3,25,000తోపాటు అన్ని గ్రామాలకు గత ప్రభుత్వం పరిహారం కింద విడుదల చేసిన జీవోకు వెంటనే పరిహారాన్ని ఇప్పించాలని నిర్వాసితులు కోరారు. కొండాపురంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ముంపునకు గురైన జడ్పీ హైస్కూల్ స్థానంలో కొత్త స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మాజీసర్పంచ్ విశ్వ నాథరెడ్డి, ఎంపీటీసీ భర్త బాబురెడ్డి తదితరులు జేసీని కోరారు. ముంపునకు గురైన అన్ని గ్రామాల నుంచి జేసీ నిర్వాతులతో వివరాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దార్ గురప్ప, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు నిర్వాసితులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు పోట్లదుర్తి విద్యార్థులు



ఎర్రగుంట్ల, నవంబరు 6: మండల పరిధిలోని పోట్ల దుర్తి విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో మంచి ప్రతిభను కనపరచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. నవం బరు 2 నుంచి 4 వరకు అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలబాలికల ఖోఖో పోటీల్లో పోట్లదుర్తి విద్యార్థులు జిల్లా స్థాయి జట్టుకు ప్రాతినిత్యం వహించి మంచి ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. ఇందులో ఖోఖోలో పదవ తరగతి విద్యార్థిని దేవి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈమె ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో డిసెంబర్ 5 నుంచి 8వరకు జరిగే పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే రాయచోటిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పోట్లదుర్తి విద్యార్థి హర్షవర్ధన్ ఎంపిక అయ్యారు. మహారాష్ట్రలో డిసెంబర్‌లో నిర్వహించే యోగాసన పోటీల్లో పాల్గొంటారు. వీరిని హెచ్ఎం పద్మనాభరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు బి.లక్ష్మి,సెస్సితబితారాణిలు, ఉపాధ్యాయులు అభినందించారు.

టెన్నికాయిట్‌లో రాష్ట్రస్థాయికి మానస



కడప స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెన్నికాయిట్ అండర్-14 క్రీడా పోటీల్లో వీరబల్లి కేజీబీవీ విద్యార్థిని ఎం.మానస అత్యున్నత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ సి.పార్వతి వెల్లడించారు. స్థానిక మునిసిపల్ ఉర్దూ స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి అండర్-14 క్రీడాపోటీల్లో ఎం.మానస అత్యున్నత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మానస త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి తద్వారా జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



సింహాద్రిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామ సమీపాన ఓ రేకుల షెడ్డులో స్టాక్ పాయింట్‌గా చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలించే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సింహాద్రిపురం ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు.. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలానికి చెందిన తుమ్మల మిత్రమనాయుడు చుట్టుపక్కల మండలాల నుంచి రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక లాభాలు పొందేందుకు ఇతర ప్రాంతాలకు తరలించేవాడు. ఈనేపథ్యంలో కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు కడప విజిలెన్స్ అధికారులు పులివెందుల సీఎస్‌డీటోలతో కలిసి దాడులు నిర్వహించారు. 105 బస్తాలలో రూ.1,57,839లు విలువ గల 3469 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మిత్రమ నాయుడును పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్థల విషయమై దౌర్జన్యం

దువ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని ఇందిరమ్మ కాలనీలో స్థలం విషయమై ముగ్గురు వ్యక్తులు మరో వ్యక్తిపై దాడికి పాల్పడ్డారని స్థానిక పోలీసులు తెలిపారు. శేఖర్ అనే వ్యక్తికి సంబంధించిన రెండు సెంట్ల స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని కందుల గిరి, ఎం.సురేష్, ఎం.సురేంద్ర దౌర్జన్యానికి పాల్పడి దాడి చేశారని తెలిపారు. ఖాళీ చేయించే వ్యవహారం అయిదేళ్లుగా కొనసాగుతోందని చెప్పారు. దారి వెంట వెళుతున్న శేఖర్‌పై దాడికి పాల్పడ్డారని, బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో 15 గొర్రెలు మృతి




విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన గొర్రెలు

చక్రాయపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుపల్లె గ్రామ సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై 15 గొర్రెలు మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కల్లూరుపల్లె సమీపంలో మేతకోసం మేకలను తోలుకొని వెళ్తుండగా రోడ్డుపై విద్యుత్ వైరు తెగిపడింది. దీంతో ఆ ప్రాం తంలో గొర్రెలు వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాయి. గొర్రెల కాపరి నరసింహనాయుడుకు కూడా విద్యుత్ షాక్ తగలడంతో మూర్చిల్లిపోయాడు. గొర్రెలు మృతి చెందడతో దాదాపు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని గొర్ల యజమాని బంధువులు తెలిపారు. అలాగే గొర్రెలకు పశువైద్యాధికారి పోస్టు మార్టం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో కత్తితో దాడి ఇరువురికి గాయాలు

పులివెందుల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామ పంచాయతీ కానేపల్లె గ్రామంలో కుటుంబకలహాలతో గంగనపల్లె బాషా కత్తితో దాడికి పాల్పడ్డ సంఘటనలో బండి సూరి వీరయ్య, ఉడవ గండ్ల బాషాలకు గాయాలయ్యాయి. వివరాలిలా.. బండిసూరి వీరయ్య కొడుకు దస్తగిరి అదే గ్రామంలో ఉండే గంగనపల్లె బాషా కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే వారిరువురు మధ్య విబేధాలు రావడంతో దస్తగిరి తన భార్యతో విడాకులు కావాలంటూ కోర్టు ద్వారా నోటీసులు పంపారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య విబేధాలు వచ్చాయి. మంగళవారం రాత్రి బండి వీరయ్య తన బంధువైన ఉడవగండ్ల బాషాతో కలిసి గంగనపల్లె బాషా ఇంటి వద్దకు వెళ్లి ఘర్షణకు దిగాడు. దీంతో గంగనపల్లె బాష ఇంటిలో ఉన్న కత్తి తీసుకుని బండి సూరి వీరయ్యను అతనితో వచ్చిన బాషాపై కత్తితో పొడవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారని.. బాధితుల ఫిర్యాదు మేరకు గంగనపల్లె బాషాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



CHANGE OF NAME

I "SHAIK JABBAR" S/o GALI SAHEB GARI SHAIK BADULLA SAHEB, D.No. 15/702, ZINNA ROAD, PRODDATUR 516360, HAVE CHANGED MY NAME FROM "SHAIK JABBAR"(OLD NAME) TO "GALI SAHEB GARI SHAIK JABBAR" (NEW NAME). HENCE FOR THE I MAY CALLED AS "GALI SAHEB GARI SHAIK JABBAR" FOR ALL PURPOSES.

AJC-000

CHANGE OF NAME

I "SHAIK THASLIM BEGUM" W/o SHAIK JABBAR, D.NO. 15/702, ZINNA ROAD, PRODDATUR 516360, HAVE CHANGED MY NAME FROM "SHAIK THASLIM BEGUM"(OLD NAME) TO "GALI SAHEB GARI SHAIK TAHASIN BEGUM" (NEW NAME). HENCE FOR THE I MAY CALLED AS "GALI SAHEB GARI SHAIK TAHASIN BEGUM" FOR ALL PURPOSES.

AJC-000

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

UTI MUTUAL FUND

Land, Gold మరియూ ఏ ఇతర సాధనముల కన్న ఎప్పుడైన నగదు చేసుకొనే సౌకర్యము మంచి రాబడి ఎప్పుడూ నగదు మనచేతిలో వుంది అనే ధైర్యమును ఇచ్చు పథకము **UTI EQUITY SAVING FUND.** పథకము **ROM OD** చూడండి. పెట్టుబడి పెట్టండి. **AVS Chandra Reddy, M.Sc., MEd, AMFi, MFD Cell : 98660 99827.**

Ajc-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ **7382114647**

AJA- 198462

అమ్మబడును

➾ నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టుకు దగ్గరలో పొలాలు,, ప్లాట్లు, ఇల్లు మరియు సింగరాయకొండటు పైదుకూరు హైవే ప్రక్కన పొలాలు, ప్లాట్లు, ఇల్ల స్థలాలు అమ్మబడును. సంప్ర॥ **9704250705.**

AJG-200050

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అయ్యవార్లు... ఇది మీకు తగునా...?

- ఒకేరోజు ఇరువురు ఉపాధ్యాయులు గైర్హాజరు



ఉపాధ్యాయుల గైర్హాజరుతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కాశినాయన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇరువురు ఉపాధ్యాయుల తీరు మారూటే సపరేటు అన్నట్లుంది. ఒకవైపు ప్రభుత్వం సర్కారు బడుల బలోపేతానికి చర్యలు చేపడుతుంటే అలాంటివి మాకు వర్తించవు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. బుధవారం ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారు. ఉదయం 11గంటలు అవుతున్నా ప్రధానోపాధ్యాయుడు ఓ.బాలశోభన్‌కుమార్, మరో ఉపాధ్యాయుడు వెంకట్రామయ్య పాఠశాలకు చేరుకోలేదు. ఒకవైపు అదేరోజు సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఉదయం నర్సాపురం ఎమ్మార్సీ కార్యాలయానికి వెళ్లి ప్రశ్నపత్రాలు తెచ్చుకొని ఉదయం 9.30 గంటలకు పరీక్షను ప్రారంభించాలి. అవేవి పట్టించుకోకుండా ఇరువురు ఉపాధ్యాయులు బడికి ఎగనామం పెట్టారు. ఈవిషయం ఆలస్యంగా తెలుసుకున్న సంబంధిత అధికారి ఉదయం 11.30 గంటలకు సీఆర్పీని పంపి మమ అన్నట్లు పరీక్ష నిర్వహిం చారు. ఇక్కడి అయ్యవార్లు గత కొంతకాలంగా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని.. సమయపాలన పాటించడం లేదని పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదంటున్నారు స్థానికులు. పాఠశాల సీఆర్పీ రవి కూడా ఈఇద్దరు ఉపాధ్యాయుల తీరుపై పలుమార్లు ఎంఈవో దృష్టికి తీసుకు పోయినట్లు సమాచారం. ఇరువురు ఉపాధ్యాయుల మధ్య సఖ్య త కొరవడి.. ఒకరిపై ఒకరు పోటీపడి బడికి గైర్హాజరవుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయంపై ఎంఈవో2 ఓ.ప్రమీళను వివరణ కోరగా తనకు ముందస్తు సమాచారం లేదని.. విషయం తెలుసుకొని 11 గంటల తర్వాత సీఆర్పీని అక్కడికి పంపించానన్నారు. ఇరువురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకొని ఉన్నతాధికారులకు తెలిజేస్తామన్నారు.

MUNICIPAL CORPORATION, KADAPA

"ap'e-procurement Tender Notice. 5398/ATO/MCK dt: 07.11.2024

S.No.	Description	No. of Works	Ecv. Rs. in lakhs
01	General Funds	08	40.18
	TOTAL: -	08	40.18

08	Bid Document Download Start Date	Bid Document Download End Date	Bid Submission Closing Date & Time
03	06.11.2024 @ 3.00 PM	13.11.2024 @ 03.00 PM	13.11.2024 @ 03.30 PM
03	06.11.2024 @ 5.00 PM	13.11.2024 @ 03.00 PM	13.11.2024 @ 03.30 PM
02	06.11.2024 @ 3.00 PM	20.11.2024 @ 03.00 PM	20.11.2024 @ 03.30 PM

Further details can be seen at 'e' Procurement market place in **www.apeprocurement.gov.in** officer inviting bid, Commissioner, Municipal Corporation of Kadapa, A.P.

Sd/- Commissioner,
Kadapa Municipal Corporation,YSR District.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనగలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మయ్యగారిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని ముద్రపల్లె ఫీడర్ పరిధిలో గురువారం కరెంటు కోత ఉంటుందని పెనగలూరు విద్యుత్ ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. కడియంవారిపల్లె, ముద్రపల్లె, రాజుపాళెం, గోవిందంపల్లె, లక్ష్మీపురం గ్రామాల్లో కరెంటు లైన్ల కింద కొమ్మల తొలగింపు, లైన మరమ్మతులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు కోత విధిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్వాడీ భవనానికి కొత్త హంగులు

సిద్దవటం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి దశరథ నాయుడు చొరవతో జంగాలపల్లె గ్రామ పంచాయతీ కమ్మపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం కొత్త హంగులు సంతరించుకుంది. తన తల్లిదండ్రులు దారపునేని చెన్నయ్య నాయుడు, తిరుపతమ్మ జ్ఞాపకార్థం రూ 15 వేల వ్యయంతో అంగన్వాడీ కేంద్ర భవనానికి పెయింటింగ్ వేయించారు

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



కొప్పులవాండ్లపల్లెలో ప్రతిష్ఠించిన సీతా, రామ, లక్ష్మణ విగ్రహాలు

గాలివీడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలచెరువుపల్లి పంచాయతీ కొప్పులవాండ్లపల్లెలో నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో బుధవారం సీతా రామలక్ష్మణ, విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అంతకుమునుపు విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు చెందిన అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెల్లు గంగరాజు, గురుస్వామి వెంకటేశ్వరులు, నాగేంద్రబాబు తెలిపారు. అయ్యప్ప భక్తులందరూ ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో భిక్ష(బోజనం) చేయవచ్చున్నారు. మాల ధరించిన వారికి గుడిలో అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. జనవరి నెల 15 తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

రామాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఏర్పాటు చేసినట్లు రామాపురం తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని చిట్లూరులో రెండవ రోజు బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ మండల నాయకులు గాలివీటి సురేందర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కృపావతి, ఆర్ఐ సమ్మద్‌ఖాన్, సర్వేయర్, వీఆర్‌వోలు, రాజంపేట పార్లమెం ట్ టీడీపీ కార్యదర్శి తుమ్మల ఓబులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి చింతపిచ్చల రామకృష్ణగౌడ్, దేవా దర్శన్ రెడ్డి, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవానికి సుగవాసికి ఆహ్వానం

నందలూరు, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మగ్దూం బాబా ఉరుసు మహోత్సవంలో పాల్గొనాలని చిన్న పీఠాధిపతి సయ్యద్ హైదర్‌హుస్సేని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంను కోరారు. రాజంపేట ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఉరుసు నిర్వాహకులు ఆయనను కలిశారు. ఈనెల 10న గంధం, 11న ఉరుసు ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తోట కేదార్నాథ్‌బాబు, హర్యామ న్రైట్స్ జిల్లా మైనార్టీ చైర్మన్ హాజీ జుల్ఫీకర్, టీడీపీ నాయకులు షేక్ మౌలా తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లె పంచాయతీలో నిధుల గోల్‌మాల్!

● డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు ● విచారణకు పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు ● మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

పుల్లంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో రెడ్డిపల్లె గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయంటూ అందిన ఫిర్యాదుపై వెంటనే విచారణ చేయాలని సాక్షాత్తూ పంచాయతీరాజ్ సెక్రటరీ ఆదేశించినా స్థానిక అధికారులు బేఖాతరు చేశారు. ఆయన ఆదేశాలిచ్చి రెండు వారాలు గడుస్తున్నా. ఇంతవరకూ స్పందించిన పాపాన పోలేదు. వివరాలిలా ఉన్నాయి . పుల్లంపేట మండలం రెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో భారీస్థాయిలో నిధులు దుర్వినియోగమయ్యాయంటూ స్థానిక టీడీపీ నాయకుడు రొంపిచెర్ల మురళి కొన్ని రోజుల క్రితం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వారం రోజుల్లో విచారణ చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ రాజంపేట డీఎల్పీవోను ఆదేశించారు. ఇప్పటికి రెండు వారాలు పూర్తయినా విచారణ ముందుకు సాగడంలేదు. రెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో కార్యవర్గం తీర్మానాలు చేయకుండానే నిధులు డ్రా చేశారని ఆరోపణ. పంచాయతీలో ఏనాడూ చెత్త ఎత్తకపోయినా ఇద్దరు గ్రీన్ అంబాసిడర్ల ద్వారా నెలకు 12 వేల రూపాయలు డ్రా చేశారని, పంచాయతీ పరిధిలోని ఐదు తాగునీటి పథకాలకు మరమ్మతుల పేరుతో నిధులు స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సచివాలయ నిర్వహణ పేరుతో కూడా భారీగా నిధులు దుర్వినియోగం చేశారని డిప్యూటీ సీఎం ఇచ్చిన ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి విధులకు గైర్హాజరవడంతోపాటు, తిరుపతి నుంచే ప్రత్యేక యాప్ ద్వారా బయోమెట్రిక్ అటెండెన్స్ వేసేవాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేస్తే



రెడ్డిపల్లె గ్రామ సచివాలయ భవనం (ఇన్‌సర్ట్) పంచాయతీ కార్యదర్శి పేరు లేని అటెండెన్స్ రిజిస్టర్

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల దుర్వినియోగం వెలుగులోకి వస్తుందన్నారు ఈ విషయంపై డీఎల్పీవో మస్తాన్‌వలిని వివరణ కోరగా తాను శిక్షణలో ఉన్నందున విచారణ ఆలస్యమైందని, రెండు రోజుల క్రితం రికార్డులన్నీ తెప్పించుకున్నామని, బిల్లులు పరిశీలించిన తర్వాత నివేదిక పంపుతామన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీఏ చంద్రానాయక్

రాయచోటిటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ తెలిపారు. బుధవారం రాయచోటి మండల పరిధిలోని తొగటపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేరుశనగ సాగులో జిప్సం వినియోగం, పంటల బీమా పథకం, కౌలు కార్డుల ప్రయోజనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్‌ల వినియోగం తదితర అంశాలను వివరించారు. సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ ధరకు లభిస్తుందన్నారు. సబ్సిడీలు పోనూ యూరియా బస్తా ధర రూ.268 ఉండా నానో యూరియా బాటిల్ ధర రూ.230 వస్తుందన్నారు. ఈ యూరియాను వరి, వేరుశనగ తదితర 94 రకాల పంటల మీద పిచికారీ చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమలో వ్యవసాయ అధికారి దివాకర్‌బాబు, వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ. ఆదర్శ పాఠశాలల్లో ఎమ్మెల్యే తనిఖీలు



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పుల్లంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, ఆదర్శ పాఠశాలలను బుధవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని సమస్యలపై ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులతో చర్చించారు. ఆదర్శ పాఠశాల క్రీడా మైదా నం సక్రమంగా లేదని ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో వాటర్ ఫిల్టర్‌కు మరమ్మతులు చేయించి విద్యార్థులకు మంచినీరు అందించాలని ఆదేశించారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, ముక్కా వరలక్ష్మి, ప్రిన్సిపాల్ రూత్‌మేరి, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉచిత ఇసుక’కు అడ్డుపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకకు అడుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇసుక బాధితులతో కలిసి రాయచోటి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్య ప్రజలు ఇండ్లు కట్టుకో వడానికి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లలవచ్చని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ కొంత మంది ట్రాక్టర్ ఇసుక లోడుకు రూ.500 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రాయచోటి పట్టణానికి చెందిన వెంకటసుబ్బారెడ్డితో పాటు మరికొంత మంది అక్రమంగా ఇసుకను తరలిస్తూ వేలకు వేలు గుంజుతున్నారని బాధితులు వాపోతున్నారన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు రమణ, శ్రీను, పలువురు ఇసుక బాధితులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల సమావేశానికి తరలిరండి

గాలివీడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో మోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా సమస్యల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబరు 26 న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనలు విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 8న రాయచోటిలో నిర్వహిస్తున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆ మేరకు బుధవారం గాలివీడులో రైతులతో మాట్లాడారు. కార్మికుల హక్కులకు భంగం కలిగేలా 42 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను రూపొందించినట్లు తెలిపారు. గిరిజనులకు నష్టదాయకమైన అటవీ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.

మిల్లర్‌లో చిక్కుకుని ఒకరి మృతి



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గాలివీడే, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):ప్రమాద వశాత్తూ మిల్లర్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గాలివీడు గ్రామం చిలకలూరి పేటకు చెందిన తలారి హరినాథ (30), సోమశేఖర్ అదే గ్రామానికి సమీపంలోని పొలంలో దుక్కులు చేసేందుకు బుధవారం మిల్లర్ తీసుకుని వెళ్లారు. భూమి దున్నతున్న సమయంలో హరినాథ ప్రమాదవశాత్తూ మిల్లర్ కింద మృతి చెందాడని తెలియజేశారు. స్థానికులు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సాంబశివరావు

పెనగలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాల పనులు వేగవంతం చేయించాలని హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ సభాభవనంలో ఆయన హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బందితో పాటు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2024 వరకు పదేళ్ల కాలంలో పెండింగ్‌లో పడిపోయిన పక్కా గృహాల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. డిసెంబరు నాటికి ప్రభుత్వ లక్ష్యం పూర్తి కావాలన్నారు. ఈ సమావేశంలో డీఈఈలు ఎం.మురళీకృష్ణ, కె.మురళీకృష్ణ, పెనగలూరు ఏఈ హరిప్రసాద్, ఎంపీడీవో విజయరావు, డిప్యూటీ తహసీల్దారు జ్యోతి, ఏపీఎం నిరంజన్‌కుమార్, ఏపీవో మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి



వినతులు స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస్ అంజనేయ మూర్తి అధికారులకు సూచించారు. బుధవారం రాఘవరాజుపురం పంచాయతీలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ సందర్భంగా ఆయన మాట్లా డారు. సమస్యలతో విద్యుత్ కార్యాలయానికి వచ్చే వినియోగదారులకు న్యాయం చేయాలని తెలిపారు. అనంతరం వినతిపత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో విద్యుత్ అర్థిక సభ్యులు కె.రామమోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్.ఎల్. అంజనీ కుమార్, కోడూరు ఏఈ భాస్కర్ రావు, ఐదు మండలాల ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాంబకు వెండి ఆభరణాలు సమర్పణ



ఆభరణాలు అందజేస్తున్న భక్తులు

చిట్వేలి, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : స్థానిక సోమేశ్వరాలయంలోని శ్యామలాంబదేవి అమ్మవారికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దోనెల రవీంద్రనాథ్ ధర్మపత్ని వెంకటకళ్యాణి కుటుంబ సభ్యులు మూడు లక్షల విలువైన వెండి తొడుగు , ఇతర ఆభరణాలను సమర్పించారు. మన్నూరు కిషోర్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి పెద్ద హస్తాలు, దోర్నాదుల సంతోష్ కుటుంబ సభ్యులు చిన్న హస్తాలు, కామిశెట్టి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు పాదాలు, సెంకూరి నారాయణ కుటుంబ సభ్యులు కర్ణాభరణాలు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ చైర్మన్ వీరాంజనేయులు, ఆర్గనైజర్ బొంతల నాగేశ్వరావు, సభ్యులు రోళ్ల మోహన్, చౌడవరం సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే చర్యలు



మాట్లాడుతున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించకపోతే చర్యలు తప్పవని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు వాహనాల రిజిస్ట్రేషన్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. అధిక లోడుతో ఆటోలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించడంతోపాటు నిబంధనల మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరిచారు. ఎంవీఐ అజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ విశ్వనాధరెడ్డి, ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీ, బిడ్డల ఆత్మహత్య కేసు నీరుగారుస్తున్న పోలీసులు

● న్యాయం జరగలేదంటూ బంధువుల ఆవేదన



మీడియాతో మాట్లాడుతున్న మృతురాలు రమాదేవి బంధువులు

రాయచోటిటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో గల ఆగస్టు నెల 17వ తేదీన ఎర్రగుడి రమాదేవి (34) అనే మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న కేసును రాయచోటి పోలీసులు నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆమె సోదరుడు గాలివీటి నారాయణ, గాలివీడు వెన్నెల, బంధువులు శాంతమ్మ, సరోజమ్మ, లక్ష్మీదేవి విలేకరుల సమావేశంలో వాపోయారు. ఈ కేసు విషయంలో ఎస్పీని కలిసిన అనంతరం వారు స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద విలేకరులకు వివరాలు వెల్లడించారు గత ఆగస్టు 17 రాత్రి 10.30 గంటలకు సచివాలయ ఉద్యోగి జ్యోతి వారి ఇంటి వద్దకు వెళ్లి ఇంటి బయటకు వచ్చి నా చేతిలో చస్తావా.. ఇంట్లోనే చస్తావా.. అంటూ బజారులో దుర్భాషలాడుతూ తిడుతూ కేకలు వేస్తుండడంతో అవమానానికి గురైన రమాదేవి పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుందన్నారు. పోలీసులు మాత్రం ప్రలోభాలకు లొంగి కువైట్‌లో ఉన్న రమాదేవి భర్తపై మాత్రమే కేసు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. ఆత్మహత్యకు ప్రధాన కారణమైన సచివాలయ ఉద్యోగిని అరెస్టు చేయడంతో పాటు, రమాదేవి భర్తను తక్షణం రప్పించి శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. రమాదేవి ఆత్మహత్యకు సచివాలయ ఉద్యోగి జ్యోతి కారణమని బంధువులు ఆరోపిస్తున్నా పట్టించుకోకుండా సీఐ దగ్గరికి వెళ్లమని చెప్పి చేతులు దులుపుకోవడం సరైన పద్ధతి కాదని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయవాది టీ. ఈశ్వర్ విమర్శించారు. జ్యోతి మృతురాలి ఇంటిపై దౌర్జన్యానికి వచ్చినట్లు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయినా సమగ్ర విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేయడం బాధితులకు అన్యాయం చేయడమేనన్నారు.

కర్నూలు రేంజి డీఐజీకి సన్మానం



డీఐజీని సత్కరిస్తున్న జగన్‌మోహన్‌రాజు చిత్రంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాజంపేట టౌన్, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్‌ను బుధవారం రాజంపేట ఆర్‌అండ్‌బీ బంగ్లాలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు సత్కరించారు. డీఐజీ వెంట ఎస్పీ విద్యా సాగర్‌నాయుడు ఉన్నారు. టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి సుబ్రమణ్యం నాయుడు, మైనార్టీ నాయకులు గుల్జార్‌బాషా, కొల్లు రెడ్డయ్యనాయుడు పాల్గొన్నారు.

తాళ్లపాక అభివృద్ధిపై ‘టీటీడీ’ సభ్యులకు వినతి



టీటీడీ బోర్డు సభ్యుడు అనుగోలు రంగశ్రీని సత్కరిస్తున్న జనసేనపార్టీ నాయకులు

రాజంపేట, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాక గ్రామాన్ని అభివృద్ధి చేయాలని రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ విజ్ఞప్తి చేశారు. జనసేనపార్టీ నుంచి టీటీడీ పాలక మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనుగోలు రంగశ్రీ, బుంగనూరు మహేందర్‌రెడ్డికి ఈ మేరకు విజ్ఞాపన పత్రాన్ని అందజేసి వారిని ఘనంగా సత్కరించారు. తాళ్లపాక గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అన్నమయ్య ధ్యానమందిరాన్ని పునరుద్ధరించాలని, ట్యాంక్‌బండ్ రీతిలో తాళ్లపాక చెరువులను అభివృద్ధి చేయాలని, డబుల్‌రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శ్రీవారి ఆలయంలో శ్రీవారి అన్న ప్రసాదం, లడ్డూ ప్రసాదాన్ని ఇవ్వాలని, థీమ్‌పార్కును అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరిపల్లె ఆలయ ధర్మకర్త టైల్స్ నరసింహ, ఊటుకూరు మాజీ సర్పంచ్ ఎంఎల్ నరసయ్య, జనసేన నాయకుడు అబ్బిగారి గోపాల్ పాల్గొన్నారు.

పట్టాదారులకు స్థలాలు చూపండి

రామాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని సుద్దమళ్ల గ్రామ ఎగువ హరిజనవాడకు చెందిన 50 దళిత కుటుంబాలకు 1994లో నాటి ముఖ్యమంత్రి నంద మూరి తారకరామారావు ఇచ్చి న పట్టాలకు స్థలాలు చూపిం చాలని బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రామాంజనేయులుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత, సీపీఐ మండల నాయకులు ఓబులేసు, గణేశ్, మహిళా సంఘం కార్యకర్త ప్రమీల, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కోడూరులో పారిశుధ్య చర్యలు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చెత్త తొలగించడంతో శుభ్రంగా కనిపిస్తున్న వీధి

రైల్వేకోడూరు(రూరల్), నవం బరు 6:(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం అస్తవ్యస్తం అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. రైల్వే కోడూరు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రావు, అనంతరాజుపేట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ బాలకృష్ణంరాజు పనులను పర్యవేక్షించారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 11న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాదికారి హుస్సేన్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. రెడ్డి, బాషా, నాగముని, చోటా, మహబూబ్‌బాషా, వెంకటేశ్, ఆదిరెడ్డి, రమణ పాల్గొన్నారు.

ముదురు మామిడి తోటల్లో కొమ్మలు కత్తిరించాలి

రైల్వేకోడూరు, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి) ముదురు మా మిడి తోటల్లో కొమ్మలు కత్తిరిం చాలని ఉద్యానశాఖాధికారి ఎం. భాస్కర్ సూచించారు. బుధవారం రైల్వేకోడూరు మం డలంలోని చియ్యవరం కమ్మపల్లి, ఎన్‌వీఎస్ గిరిజన కాలనీ ల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైల్వేకోడూరు వ్యవసాయ శాఖాధికారి జి. సుధాకర్, సువెన్ కంపెనీ జనరల్ మేనేజర్ కొండారెడ్డి , వీహెచ్ఏ రాజేష్, పశుసంవర్ధక, మార్కెటింగ్ శాఖల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణరాజు పోడులో వైద్య శిబిరం

రైల్వేకోడూరు, నవంబరు 6: (ఆంధ్రజ్యోతి) మండలంలోని నారాయణరాజు పోడులో బుధ వారం అనంతరాజుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ బాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు, జలుబు తదితర సమస్యలకు మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజలు గోరువెచ్చని నీరు, వేడిగా ఉన్న పదార్థాలను తీసుకోవడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని తెలిపారు. చేతులను సబ్బుతో కడుక్కోవాలని తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

రైల్వేకోడూరు, నవంబరు 6:(ఆంధ్రజ్యోతి) అంగన్వాడీ యూనియన్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేయాలని రైల్వేకోడూరులో 2023లో చేసిన ధర్నాకు సంబంధించి 11 నెలల తర్వాత పోలీసులు 41 నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని తెలిపారు. ఎవరి విధులను ఆటంకం కల్పించకుండా, శాంతియుతంగా ధర్నా చేసినట్లు తెలిపారు. వైసీపీ నేతల ఒత్తిడితో ఎవరో పంచాయతీ కార్యదర్శితో ఫిర్యాదు ఇప్పించి అక్రమంగా కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో క్రీడాప్రాంగణం సిద్ధం

రామాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలల్లో ఆట స్థలాల ఏర్పాటుకు బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్థలాన్ని చదును చేసినట్లు ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టుల ఏర్పాటుకు ఎన్‌ఎస్‌ఎస్ పూనుకోవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అఫ్రోజ్‌బేగం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిన్నరెడ్డెప్ప, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

సిద్దవటం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల ఇన్‌చార్జి తహసీల్దారు గా డిప్యూటీ తహసీల్దారు మాధవీలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు నిర్ణీత సమయంలో అందజేస్తామని తెలిపారు.

యువత అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలి

గాలివీడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించుకోవాలని, నైపుణ్యం ఉన్న వారికే ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని ఎంపీడీవో జవహర్‌బాబు అన్నారు. బుధవారం గాలివీడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ సచివాలయం సిబ్బందికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య గణనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న ప్రతి ఒక్కరి డేటా సేకరించాలన్నారు. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుతం ఉపాధి వివరాలు, నైపుణ్యాలు తదితరాలకు సంబంధించి 25 రకాల ప్రశ్నలకు సమాధానం సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆయా వ్యక్తుల విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, ఉద్యోగ ఆసక్తి తదితర వివరాల యాప్‌లో నమోదు చేయాల న్నారు.



అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

పెనగలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ప్రభుత్వ సిబ్బంది ప్రత్యేక చొరవ కనబర చాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఆయన మండల పరిషత్ సభాభవనంలో అభివృద్ధి పనులపై ప్రభుత్వ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆయన శాఖల వారీగా ప్రగతిని తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, రెవెన్యూ సమస్యలపై వాకబు చేశారు. ఉచిత ఇసుక రవాణా గురించి ఆరా తీశారు. గృహనిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం సిద్దవరం గ్రామానికి చెందిన న్యాయవాది గోపిగారి రెడ్డెయ్య, సింగనమల సర్పంచ్ ఎర్రి శివయ్య తదితరులు సిద్దవరం గ్రామ పరిధిలో జరిగిన పలు భూఆక్రమణల గురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇండ్లూరు, కొత్తపల్లె గ్రామాలకు చెందిన ముస్లింలు నూర్‌బాషా, దూదేకుల సంఘం సభ్యులు గ్రామంలో ఉన్న ఒక మసీదుకు అనుసంధానంగా ఈద్గా ఒకటి ఉందని, గ్రామంలోని ఒక వ్యక్తి ఇంకో ఈద్గాను నిర్మించాలని చూస్తున్నారని, దానిని నిలుపుదల చేయాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ డిప్యూటీ కలెక్టర్ శివజ్యోతిని విచారణకు ఆదేశించారు. కొత్తపల్లెలోని జామియా మసీదు ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల ద్వారా స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ నారాయణనెల్లూరు, కోమంతరాజపురం ఇసుక క్వారీలను తనిఖీ చేశారు.

యువకుడి దారుణ హత్య



సంఘటనా స్థలం వద్ద పోలీసు జాగిలంతో సిబ్బంది



హత్యకు గురైన వెంకటనారాయణ

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని చౌడవరం చెరువు కట్ట సమీపం చియ్యవరం గ్రామానికి వెళ్లే దారిలో బుధవారం ఓ యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి దారుణంగా హత్య చేశారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని ఉర్లగట్టుపోడు గ్రామానికి చెందిన పిటాని వెంకటనారాయణ (39) నియోజకవర్గంలో టైల్స్ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఈయన ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట గ్రామంలో ఒక అమ్మాయితో సహజీవనం చేస్తున్నాడని, హత్యకు ఇదే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించి కత్తులతో మెడ వద్ద పొడిచినట్లు ఆనవాళ్లు ఉన్నాయని, అక్కడికక్కడే మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. సంఘటన సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరావు, ఎస్ఐ నవీన్‌బాబు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే పోలీసు జాగిలం వచ్చి పరిశీలించింది. హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. శవాన్ని శవపరీక్ష నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. అయితే వెంకటనారాయణ స్వగ్రామం వెస్ట్ గోదావరి అని తెలిసింది. రైల్వేకోడూరు మండలంలోని ఉర్లగట్టుపోడు అడ్రస్‌కు ఆధార్ కార్డును మార్పు చేసుకున్నాడు. మృతుడి స్వగ్రామ పరిధి పోలీస్‌స్టేషన్‌లో వెంకటనారాయణ మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు ఉందని తెలిసింది. వీటన్నింటిపై పోలీసులు విచారిస్తున్నారు.

కుక్కర్ పేలి మహిళకు తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ అమీరున్

పెద్దతిప్పసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుక్కర్ పేలి ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు మండలంలోని రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెకు చెందిన ఓ నిరుపేద సిద్దయ్య భార్య అమీరున్ ఇటీవల ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కుక్కర్ పేలడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేక నాలుగు రోజుల నుంచి ఇంటివద్దే ప్రథమ చికిత్స చేయించుకుంటూ ఉండేది. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు నగదు పోగుచేసి బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి బుధవారం కొంత ఆర్థికసాయం చేసి మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీంతోపాటు గాయాలు నయం అయ్యేంత వరకు అయ్యే ఖర్చు తాము భరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలే అమీరున్ భర్తకు ఆరోగ్యం సరిగా లేక అప్పులు చేసి పలు ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. ఇప్పుడు ఈమెకు ఇలా జరగడంతో ఆ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. కాగా బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేసిన యువకులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మదనపల్లెలో ప్రకాశం జిల్లా వాసి మృతి



మృతి చెందిన నజీర్ అహ్మద్

మదనపల్లెఅర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన వృద్ధుడు బుధవారం మదనపల్లెలో మృతి చెందినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. సింగరాయకొండ సెల్‌టవర్ వీధిలో నివాసం ఉండే నజీర్ అహ్మద్(66) మదనపల్లెలో ఉండే బంధువుల ఇంటికి సొంత పనినిమిత్తం వచ్చాడు. అనంతరం తిరిగి సొంతూరుకు వెళ్తుండగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్నవలంగా కిందపడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

పెన్నానదిలో పడిన బాలుడి మృతదేహం లభ్యం



మణికంఠ (ఫైల్)

కడప క్రైం/సిద్దవటం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధి మృత్యుంజయకుంటలో నివసించే మణికంఠ (16)అనే బాలుడి మృతదేహం ఎట్టకేలకు పెన్నానదిలో బుధవారం లభ్యమైంది. వాటర్ గండి సమీపంలో నవంబరు 3న స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. బాలుడు కనిపించకపోవడంతో బాలుడి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నచౌకు పోలీసులు ఈ నెల 4న మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఈ క్రమంలో గాలింపు చర్యలు చేపట్టగా పెన్నానదిలో బాలుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

అపార్‌కు ఆమోదం కష్టాలు..!!

● సేవల ఆమోదానికి నిరీక్షణ..!

● ఆధార్ సెంటర్లలో నమోదైనా.. హోల్డ్‌లోనే

● వార్డు, గ్రామ సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి

● క్యూ కడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలోని ఆధార్ సెంటర్ వద్ద జనాల రద్దీ

మదనపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న ఒకే దేశం.. ఒకే విద్యార్థి అనే నినాదంతో అపార్ ఐడీని కేటాయిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆధార్ తరహాలో 12 అంకెల నెంబర్‌ను కేటాయించనున్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, వారి ఆధార్ కార్డుల్లో వివరాలు ఒకే విధంగా ఉండాలన్నది నిబంధన. వీటిని సరిపోల్చితే, విద్యార్థుల వివరాల్లో 50 శాతానికిపైగా తప్పులు, పొరపాట్లు చోటు చేసుకున్నాయి. తప్పుల తడకగా ఉన్న విద్యా సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ సెంటర్లకు ప్రస్తుతం క్యూ కడుతున్నారు. ఇక్కడా వీరు తెచ్చే వివరాలు సరిపోలకపోవడంతో వారంతా మరోసారి విద్యాసంస్థలు, మున్సిపల్, పంచాయతీ, సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. జనన ధ్రువీకరణ పత్రం, అందులోని సంవత్సరం, తేదీలో కరెక్షన్, పేరు మొదట్లో ఇన్షియల్ కాకుండా సర్‌నేమ్ ఉండేలా దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. ఇలా అటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇటు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ఆధార్ సెంటర్‌లో ఒకరోజులో పని అవుతుండగా, రికార్డులు, ఆధార్‌లలో తప్పొప్పులు ఉంటే మూడు, నాలుగు రోజులు పడుతోంది. దీంతో విద్యార్థులు అటు స్కూల్స్‌కు వెళ్లలేక, వారి తల్లిదండ్రులు పనులు వదులుకుని అటు ఆధార్, ఇటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పోనీ ఇన్నీ అయినా.. ఆధార్‌లో సవరణలు పూర్తయ్యాక వెంటనే పని అవుతుందా? అంటే అదీ లేదు. ఆధార్ మెయిన్ సర్వర్‌లో యాక్టివ్ కావడానికి నెలా, నెలన్నర సమయం పడుతోంది. నెలన్నరరోజుల క్రితం వరకూ నాలుగు నుంచి వారం రోజుల్లో పూర్తయిన ప్రక్రియ, ప్రస్తుతం నెలరోజులకు పైగా పడుతోందని చెబుతున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ సెంటర్, వార్డు, గ్రామ సచివాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లోని ఆధార్ సెంటర్లకు తిరుగుతున్నారు. ఎప్పుడు యాక్టివ్ అవుతుందని, సరిచేసిన పత్రాలు తమకు ఎప్పుడు అందుతాయని వారు నిరీక్షిస్తున్నారు. ఆయా సెంటర్లలో స్టేటస్ చూస్తే సర్వీస్ ఆన్ హోల్డ్ అని, యాక్టివేషన్ పెండింగ్ అని చూపెడుతోంది. మరోవైపు సరైన ధ్రువపత్రాలు సమర్పించని వారి సేవలు చాలా వరకూ రిజెక్ట్ అవుతున్నాయి. ఆ సమాచారం తెలియడానికి కూడా ఇంతే సమయం పడుతుండగా, అలాంటి వారంతా తిరిగి ఆధార్ గడప తొక్కాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్‌లలో మొత్తం వంద వార్డు, గ్రామ ఆధార్‌సెంటర్లు ఉన్నాయి. జిల్లాలోని అయిదు సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయంలో మూడు విడతలుగా 2022 నుంచి వీటిని ఏర్పాటు చేశారు. సచివాలయంలో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ వీటిని ఆపరేట్ చేస్తున్నారు. ఇందులో కొత్త ఆధార్‌తో పాటు ఆధార్ అప్‌డేట్, డెమోగ్రఫిక్ అప్‌డేట్స్, డేట్ ఆఫ్ బర్త్, సర్‌నేమ్‌తో సహా సవరణలు చేస్తున్నారు. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటి నుంచీ రోజుకు సగటున ఒక్కో కేంద్రంలో పది సర్వీసులు వస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవి కూడా నాలుగైదు రోజుల్లో ఆమోదం అయ్యేవి. కానీ ప్రస్తుతం నెల, నెలన్నరరోజులుగా ఆ పరిస్థితి లేదు. సేవలన్నీ ఆన్‌హోల్డ్ అని చూపెడుతోంది. వీటిపై డిజిటల్ అసిస్టెంట్స్ ఎప్పటికప్పుడు టెక్నికల్ సిబ్బంది, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమాధానం లేదని చెబుతున్నారు. అయితే సచివాలయాలు, ఆధార్ సెంటర్లకు వచ్చే బాధితులకు ఏమని సమాధానం చెప్పాలని వారు వాపోతున్నారు. సరైన సమాచారం లేక వారు తలపట్టుకుంటున్నారు. ఇదిలా వుండగా మదనపల్లె మున్సిపాలిటీలో మొత్తం 44 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో అమ్మచెరువుమిట్ట, రామిరెడ్డిలేఅవుట్, అమ్మినేనివీధి, గొల్లపల్లె, రామారావు కాలనీ, సుభాష్ రోడ్డు, బాకవానితోట, నెహ్రూబజార్, వడ్డిపల్లె సచివాలయాల్లో అనుసంధానంగా ఆధార్ సెంటర్లు ఉన్నాయి. ఇలా జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాలే కాదు.. మీ-సేవా కేంద్రాలలో, బ్యాంకులు, పోస్టాఫీసులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలలో ఇలా సుమారు 360 ఆధార్‌కేంద్రాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో ఆయా ఏజెన్సీల పరిధిలో సర్వీసులు నడుస్తున్నాయి.



జననధ్రువీకరణ పత్రంలో మార్పులకోసం మున్సిపల్ కార్యాలయంలో క్యూ కట్టిన ప్రజలు

వారు అలా.. వీరు ఇలా..

అపార్ ఐడీలో భాగంగా ఆధార్‌లో మార్పులు, చేర్పులకు స్టడీ సర్టిఫికెట్ పెట్టి మార్చుకుని రమ్మని విద్యాసంస్థలు చెబుతుండగా, దాని ఆధారంగా ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసే అవకాశం లేదని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. ఒక వేళ ఆ విధంగా చేసినా రిజెక్ట్ అవుతున్నాయి. బర్త్ సర్టిఫికెట్ లేదా పదో తరగతి మార్కుల లిస్టు మాత్రమే తీసుకుంటున్నారు. నేమ్ కరెక్షన్‌కు 18 ఏళ్ల లోపు ఉన్న వారికి జనన ధ్రువీకరణ పత్రం, ఆపైన ఉన్న వారికి మార్కులలిస్టు పెడుతూ, తల్లి లేదా తండ్రి ఫింగర్ ప్రింట్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆధార్ కార్డులో తల్లిదండ్రుల పేరులో ఏమాత్రం తేడా ఉన్నా తీసుకోవడం లేదు. ఇవన్నీ సక్రమంగా ఉంటేనే ఆధార్‌లో సవరణ ప్రక్రియ జరుగుతోంది. తర్వాత జరిగే అమోదంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతంలో నాలుగురోజుల్లో ఆమోదం పొందే సేవలు ప్రస్తుతం నెల, నెలన్నర సమయం తీసుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. మధ్యలో సర్వీసును చెక్ చేస్తే అండర్ ప్రాసెస్, ఆన్ హోల్డ్ అని చూపెడుతోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాధానం చెప్పలేని నిర్వాహకులు ఆధార్‌లో ఒకసారి మార్పు చేస్తే 90 రోజుల్లో ఎప్పుడైనా ఆమోదం కావచ్చని చెప్పి పంపుతున్నారు.

టమోటాకు వాతావరణ ఆధారిత ఇన్సూరెన్స్

● జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రవిచంద్రబాబు



ఇన్సూరెన్స్ గురించి వివరిస్తున్న డీహెచ్‌వో రవిచంద్రబాబు

కలికిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే టమోట పంటకు ఇన్సూరెన్సు సౌకర్యం అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రవిచంద్రబాబు వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 మధ్య సాగు చేసే పంటకు ఈ ఇన్సూరెన్సు వర్తిస్తుందని ఆయన చెప్పారు. పీలేరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన సచివాలయాల ఉద్యాన సహాయకులకు, శాస్త్రవేత్తలకు టమోట పంటకున్న ఇన్సూరెన్సు గురించి స్థానిక కేవీకేలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉద్యానశాఖ పరిధిలో నాలుగు వేల ఎకరాల సాగుతో టమోట పంట రెండవ స్థానంలో వుందని చెప్పారు. రబీ సీజన్‌లో సాగయ్యే టమోట పంటకు వాతావరణ ప్రతికూలతల కారణంగా నష్టం వాటిల్లితే ఇన్సూరెన్సు వర్తిస్తుందని హామీ ఇచ్చారు. రైతులు ఎకరాకు రూ.1600 ప్రీమియం చెల్లించాల్సి వుందని, అదే సమయంలో పంటకు నష్టం వాటిల్లితే రూ.32 వేలు పరిహారంగా వస్తుందని తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో కూడా ప్రీమియం చెల్లించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. భూమికి సంబంధించిన 1బి, ఆధార్, బ్యాంక్ అకౌంటు, పంట ధ్రువీకరణలు సమర్పిస్తే చాలని వివరించారు. ఇన్సూరెన్సు కోసం జిల్లాకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా ఉద్యాన సహాయకులు రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. కేవీకే కోఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను వాడుతూ పసుపు, బులుగు రంగుల జిగురు అట్టలు అమర్చడం ద్వారా ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో పీలేరు, వాల్మీకిపురం ఉద్యాన అధికారులు టి.సుకుమార్‌రెడ్డి, ఇ.ఈశ్వర్‌ప్రసాద్ రెడ్డి, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాస్, కలికిరి, కలకడ, కేవీ పల్లె, గుర్రంకొండ, పీలేరు మండలాల్లోని ఆర్‌ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడాలి

- డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌తో కార్మిక నాయకుల చర్చలు



లేబర్ అధికారులతో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ఓబులవారిపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ సంస్థ నందు పనిచేస్తున్న కార్మికుల హక్కులను కాపాడా లని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కార్మిక పోరాట సమితి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాదులోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ వెంకటేశ్, తదితరులు మాట్లాడారు. ఏపీఎండీసీ యాజమాన్యం అనేక రోజులుగా కార్మికుల సమస్యలపై కాలయాపన చేస్తూ పరిష్కారం చేయలేదన్నారు. అంతే కాకుండా 2021-22కు సంబంధించి కార్మికులకు బోనస్ తక్కువగా ఇచ్చారని, పెండింగ్ మెడికల్ బిల్లులు హెల్త్ ఇండియా కంపెనీ రూ.25 లక్షలు ఎగ్గొట్టి వెళ్లిందని ఆరోపించారు. ఆ మొత్తాన్ని ఏపీఎండీసీ యాజమాన్యం ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో హెల్త్ ఇండియా వారితో మాట్లాడి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అదేవిధంగా చనిపోయిన 7 మంది కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల డెత్ ఇన్సూరెన్స్ ఇవ్వలేదని, చనిపోయినా, పదవీ విరమణ పొందినా, ఔట్ సోర్సింగ్ ట్రైనీ కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని తెలిపారు. అన్ని సమస్యలు కచ్చితంగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ చర్చల్లో ఏపీఎండీసీ అడిషనల్ జనరల్ మేనేజర్ జోసెఫ్, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మహేష్ సెట్టికర్, పోరాట కమిటీ నాయకులు సుబ్రమణ్యం, గోవిందు, వెంకటేశ్, ఈశ్వరప్ప, చంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

ట్రంప్ విజయం పట్ల సతీశ్ వేమన హర్షం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సతీశ్ వేమన (ఫైల్)

రాజంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీశ్ వేమన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొద్ది నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల నిరీక్షణకు తెరదించుతూ అమెరికా సంయుక్త రాష్ట్రాల 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నో మలుపుల మధ్య గత కొద్ది నెలలుగా హోరాహోరీగా ప్రచారం సాగించి ఎట్టకేలకు విజయం సాధించారని, ఈ విజయం వెనుక భారతీయ ప్రముఖుల కృషి ఉందన్నారు. తెలుగు వారు అత్యధికంగా ఉన్న తూర్పు రాష్ట్రాల్లో ట్రంప్ ప్రతినిధులతో కలిసి తాను సంవత్సరకాలం పాటు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. కాగా భారత, అమెరికా సంబంధాలు ఎప్పటిలాగే సుహృద్భావ వాతావరణంలో, సోదరభావంతో కొనసాగుతాయని ఆశిస్తున్నానని, తద్వారా ఇరుదేశాల అభివృద్ధి, యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడపక్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దేవునికడప ఆర్చి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పాతకడపకు చెందిన వెన్నపూస రామసుబ్బారెడ్డి (55) పనిమీద బైపాస్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన తుఫాను వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గంగప్ప

పెద్దమండ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దమండ్యం మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎన్నేపల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన గంగప్ప(50) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని కోటగాడపల్లెకు సొంత పనుల నిమిత్తం టీవీఎస్‌లో వెళ్తుండగా ఆటో వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గంగప్ప అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా విజిలెన్స్ కమిటీలో పీలేరు వాసులు



శ్రీనివాసులు, బోదేషావలి

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో పీలేరుకు చెందిన ఇద్దరికి స్థానం దక్కింది. భారతీయ అంబేడ్కర్ సేన నాయకుడు పాలకుంట శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలిని సభ్యులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వారిద్దరికీ బుధవారం నియమాకపత్రాలు అందాయి. విజిలెన్స్ కమిటీలో స్థానం దక్కించుకున్న వారిద్దరినీ పలువురు అభినందించారు.

రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వెంటనే రద్దు చేయాలి

● యూటీఎఫ్, ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ ద్వారా ఉపాధ్యాయులకు అందిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్, ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదాశివరెడ్డి, ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ వేర్వేరుగా విలేఖరులతో మాట్లాడారు. లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగుల పేరుతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, ఎంఈవోలను తమ సమీప ప్రాంతాల్లో కాకుండా దూర ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉన్న శిక్షణా కేంద్రాల్లో ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో ఉండాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు కడపలో అరకొర వసతులు ఉన్న శిక్షణ కేంద్రంలో శిక్షణ ఏర్పాటు చేశారన్నారు. 50 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులు శిక్షణ తీసుకోవడం కష్టతరంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు దృష్టిలో పెట్టుకుని ఆ శిక్షణను మండల కేంద్రాల్లో నిర్వహించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శిక్షగా మారిన శిక్షణను ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదని, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ జోక్యం చేసుకుని దీన్ని రద్దు చేయాలన్నారు.

సైబర్ కేటుగాళ్లు పొంచి ఉన్నారు..

- ఆన్‌లైన్ సేవల వినియోగంలో తొందరపాటు వద్దు
- కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలు
- అప్రమత్తంగా లేకపోతే ఖాతాలో డబ్బు ఖాళీనే



కడప క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్నాయి. మోసపోయేవారు ఉన్నంత వరకు మోసం చేసే వారు పుడుతూనే ఉంటారు. ఈజీ మనీ కోసం కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. నెట్ ఉపయోగించి ఎన్ని రకాలు కావాలంటే అన్ని రకాల మోసాలకు పాల్పడుతున్నారు. వీరి ఉచ్చులో పడితే సర్వం దోచేస్తారు. నార్త్ రాష్ట్రాల సైబర్ నేరాగాళ్లు (ఆడవాళ్లు) తియ్యటి మాటలతో బుట్టలో వేసుకుంటారు. మాయమాటలు చెప్పి ఖాతా వివరాలు తెలుసుకుని డబ్బులను దోచుకుంటున్నారు. మరికొందరు వీడియో కాల్.. లోన్ యాప్ వంటి రకరకాల పద్ధతులలో మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి మోసాలన్నీ తెలిసీ మరీ మనం మోసపోతూనే ఉన్నారు.

ఇటీవల కడపకు చెందిన ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌కు ఒక లింకు రావడంతో దాన్ని క్లిక్ చేశాడు. అంతే అతని ఖాతాలో ఉన్న డబ్బులన్నీ దోచేశారు. ఉద్యోగం పేరుతో ఓ మహిళ నుంచి లక్షలు కాజేశారు. ఓ విశ్రాంత ఉద్యోగికి అయితే వీడియో కాల్ చేసి నగ్నంగా ఉన్న చిత్రాలు గ్రూపులో పెడతానంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి అతని వద్ద లక్షలు దోచేశారు. ఇక ఈకేవైసీ, స్కానర్ లాంటి వాటి ఆధారంగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఎక్కడో ఒక చోట చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొత్త కొత్త పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

లోన్ యాప్‌లతో తస్మాత్ జాగ్రత్త

డబ్బు అవసరం ఉందని లోన్ యాప్‌ను ఆచరించారా అంతే సంగతులు. తీసుకున్న డబ్బు కంటే పదింతల రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. డబ్బు చెల్లిస్తున్నా కొత్త కొత్త నెంబర్లతో ఫోన్లు చేసి వారిని మానసికంగా శారీరకంగా హింసకు గురి చేయడంతో పాటు డబ్బు ఇవ్వకపోతే నగ్నంగా ఉన్న మీ ఫొటోలను మీ కాంటాక్ట్ నెంబర్లకు పోస్టు చేస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ డబ్బులు దోచుకుంటున్నారు. మోసపోయిన బాధితులు కొందరు పోలీసులను ఆశ్రయిస్తే.. మరికొందరు బయటకు చెప్పుకోలేక నిమ్మకుండిపోతున్నారు. ఏది ఏమైనా లోన్ యాప్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

బ్యాంకు అధికారులమంటూ ఫోన్లు చేస్తే నమ్మవద్దు

మీ బ్యాంకు ఖాతా క్లోజ్ చేస్తున్నామని... మీ అకౌంటు వివరాలు చెప్పాలని ఎవరైనా ఫోను చేస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దు. ఏ బ్యాంకు అధికారులు కూడా మీకు ఫోను చేయరు. అలాంటి వారి మాటలు నమ్మి మీ అకౌంటు వివరాలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పక పోవడమే మంచిది.

ఈకేవైసీ ఆధార్ వివరాలు చెప్పవద్దు

ఏఈపీఎస్ వినియోగిస్తున్న కస్టమర్ల పూర్తి వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరిస్తుంటారు. కొంతమంది బ్యాంకులకు వెళ్లలేక పదివేల లోపు డబ్బు కోసం ఏఈపీఎస్ వినియోగిస్తున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు మన వేలిముద్రలను సేకరించి మన ప్రమేయం లేకుండానే ఈజీగా డబ్బులు కాజేస్తున్నారు. ఖాతాదారులు బ్యాంకులకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకోవడమే మంచిది.

ఏటీఎం సెంటర్ల వద్ద ఏమరుపాటు వద్దు

ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏటీఎం మెషిన్‌లో కార్డు పెట్టి సీక్రెట్ నెంబరు కొట్టేటప్పుడు ఎవరికీ కనిపించకుండా వినియోగించడం మంచిది. ఏటీఎం వినియోగించడం చేతకాని వారు తెలిసిన వ్యక్తుల ద్వారా డబ్బులు డ్రా చేసుకోవాలి తప్ప కొత్త వ్యక్తులను నమ్మి వారికి కార్డులు ఇవ్వడం మంచిది కాదు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులలో నేరాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగిస్తున్నా రని.. ప్రతీది ఆన్‌లైన్ ద్వారానే కొనుగోలు చేసి డబ్బుల చెల్లింపులు చేస్తున్నారు. ఈవిషయంలో అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకుకు సంబంధించిన ఖాతాలు, వ్యక్తిగత వివరాలను ఇతరులకు తెలియపరచకపోవడమే మంచిది. సెల్‌ఫోన్‌లోకి వచ్చే లింకులకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ సెల్ సీఐ

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం



రక్తదాన శిబిరంలో విద్యార్థికి పండ్ల రసం ఇస్తున్న వీసీ, ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరానికి విద్యార్థులు, అధ్యాపకుల నుంచి మంచి స్పందన లభించింది. వైవీయూ డీఓఏ కార్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వీసీ క్రిష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని బతికించిన వారవుతారని అన్నారు. ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ ఆరు మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ పీఓ వెంకటరామిరెడ్డి మాట్లాడారు. వైవీయూ ఆరోగ్య కేంద్రం డాక్టర్ నరేశ్, రెడ్‌క్రాస్ సంస్థ వైద్యాధికారి ఎస్ఎస్‌వీ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పాల్గొన్నారు.

విద్యాదాత ఝాన్సీలక్ష్మీభాయి



సంబరాలు చేసుకుంటున్న చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తదితరులు

సికెదిన్నె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీభాయి ఎంతో మందికి విద్యను అందించిన విద్యాదాత అని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమణయ్య తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో చైర్‌పర్సన్ ఝాన్సీలక్ష్మీభాయి 76వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు స్థాపించి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పించి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విద్యాసంస్థల్లో రక్తదానం ఏర్పాటు చేసి 60 మందికిపైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రిమ్స్ డాక్టర్ రాజేంద్ర, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు

శ్లోకాశ్రీ, రమ్యశ్రీలు ఎంపిక

ముగిసిన ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు



బ్యాడ్మింటన్ జాతీయజట్టుకు ఎంపికైన బాలబాలికలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జికారొనేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. బుధవారం బాలబాలికలకు వ్యక్తిగత విభాగంలో పోటీలు నిర్వహించి ఐదుగురు క్రీడాకారులను జాతీయజట్టుకు ఎంపిక చేశారు. బాలికల విభాగంలో కడపజిల్లా నుంచి ఇద్దరు బాలికలు శ్లోకాశ్రీ, రమ్యశ్రీలు జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 17వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి జిలానీబాష, అబ్జర్వర్ శ్రీనివాసరావు, అరుణ, విజయప్రసాద్‌రెడ్డిలు అభినందించారు.

జాతీయ జట్టుకు ఎంపికైన బాలుర జట్టు : చరణ్‌రామ్, ప్రవణ్‌సాయి (చిత్తూరు), పార్థీవ్ (వైజాగ్), తరుణ్ (కర్నూలు), తిలోక్ (పశ్చిమ గోదావరి).
బాలికల జట్టు : శ్రావణి (వైజాగ్), భవితశ్రీ (కర్నూలు), శ్లోకాశ్రీ, రమ్యశ్రీ (కడప), లహరి (వైజాగ్).

ఖోఖో పోటీలకు పోట్లదుర్తి విద్యార్థులు



ఎర్రగుంట్ల, నవంబరు 6: మండల పరిధిలోని పోట్ల దుర్తి విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో మంచి ప్రతిభను కనపరచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. నవంబరు 2 నుంచి 4 వరకు అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలబాలికల ఖోఖో పోటీల్లో పోట్లదుర్తి విద్యార్థులు జిల్లా స్థాయి జట్టుకు ప్రాతినిత్యం వహించి మంచి ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. ఇందులో ఖోఖోలో పదవ తరగతి విద్యార్థిని దేవి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈమె ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో డిసెంబర్ 5 నుంచి 8వరకు జరిగే పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే రాయచోటిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పోట్లదుర్తి విద్యార్థి హర్షవర్ధన్ ఎంపిక అయ్యారు. మహారాష్ట్రలో డిసెంబర్‌లో నిర్వహించే యోగాసన పోటీల్లో పాల్గొంటారు. వీరిని హెచ్‌ఎం పద్మనాభరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు బి.లక్ష్మి,సెస్సితబితారాణిలు, ఉపాధ్యాయులు అభినందించారు.

టెన్నికాయిట్‌లో రాష్ట్రస్థాయికి మానస



కడప స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెన్నికాయిట్ అండర్-14 క్రీడాపోటీల్లో వీరబల్లి కేజీబీవీ విద్యార్థిని ఎం.మానస అత్యున్నత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ సి.పార్వతి వెల్లడించారు. స్థానిక మునిసిపల్ ఉర్దూ స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి అండర్-14 క్రీడాపోటీల్లో ఎం.మానస అత్యున్నత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మానస త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి తద్వారా జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు : జేసీ



గండికోట నిర్వాసితులతో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గండికోట పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. బుధవారం సాయింత్రం కడపలోని తన చాంబర్‌లో గండికోట నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పునరావాస కాలనీల్లో గత ప్రభుత్వం హయంలో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు శ్మశానవాటికలు వంటి మౌలిక సదుపాయాలు అసంపూర్తిగా ఉన్నాయని నిర్వాసితులు జేసీకి వివరించారు. ఎంతమేరకు పనులు చేపట్టారు, అసంపూర్తిగా ఉన్న వాటికి ఎంత నిధులు అవసరమవుతయో తెలపాలని పక్కనే ఉన్న ఇంజనీరింగ్ అధికారులను జేసీ ఆదేశించారు. పునరావాస పరిహారం కింద మొదటివిడత 14 ముంపు గ్రామాలకు అదనపు పరిహారం రూ.3,25,000తోపాటు అన్ని గ్రామాలకు గత ప్రభుత్వం పరిహారం కింద విడుదల చేసిన జీవోకు వెంటనే పరిహారాన్ని ఇప్పించాలని నిర్వాసితులు కోరారు. కొండాపురంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ముంపునకు గురైన జడ్పీ హైస్కూల్ స్థానంలో కొత్త స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మాజీసర్పంచ్ విశ్వ నాథరెడ్డి, ఎంపీటీసీ భర్త బాబురెడ్డి తదితరులు జేసీని కోరారు. ముంపునకు గురైన అన్ని గ్రామాల నుంచి జేసీ నిర్వాతులతో వివరాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దార్ గురప్ప, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు నిర్వాసితులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



సింహాద్రిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామ సమీపాన ఓ రేకుల షెడ్డులో స్టాక్ పాయింట్‌గా చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలించే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సింహాద్రిపురం ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు.. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలానికి చెందిన తుమ్మల మిత్రమనాయుడు చుట్టుపక్కల మండలాల నుంచి రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక లాభాలు పొందేందుకు ఇతర ప్రాంతాలకు తరలించేవాడు. ఈనేపథ్యంలో కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కడప విజిలెన్స్ అధికారులు పులివెందుల సీఎస్‌డీటీలతో కలిసి దాడులు నిర్వహించారు. 105 బస్తాలలో రూ.1,57,839లు విలువ గల 3469 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మిత్రమ నాయుడును పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్థల విషయమై దౌర్జన్యం

దువ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని ఇందిరమ్మ కాలనీలో స్థలం విషయమై ముగ్గురు వ్యక్తులు మరో వ్యక్తిపై దాడికి పాల్పడ్డారని స్థానిక పోలీసులు తెలిపారు. శేఖర్ అనే వ్యక్తికి సంబంధించిన రెండు సెంట్ల స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని కందుల గిరి, ఎం.సురేష్, ఎం.సురేంద్ర దౌర్జన్యానికి పాల్పడి దాడి చేశారని తెలిపారు. ఖాళీ చేయించే వ్యవహారం అయిదేళ్లుగా కొనసాగుతోందని చెప్పారు. దారి వెంట వెళుతున్న శేఖర్‌పై దాడికి పాల్పడ్డారని, బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో 15 గొర్రెలు మృతి



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన గొర్రెలు

చక్రాయపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుపల్లె గ్రామ సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై 15 గొర్రెలు మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కల్లూరుపల్లె సమీపంలో మేతకోసం మేకలను తోలుకొని వెళ్తుండగా రోడ్డుపై విద్యుత్ వైరు తెగిపడింది. దీంతో ఆ ప్రాంతంలో గొర్రెలు వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాయి. గొర్రెల కాపరి నరసింహనాయుడుకు కూడా విద్యుత్ షాక్ తగలడంతో మూర్చిల్లిపోయాడు. గొర్రెలు మృతి చెందడతో దాదాపు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని గొర్ల యజమాని బంధువులు తెలిపారు. అలాగే గొర్రెలకు పశువైద్యాధికారి పోస్టు మార్టం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో కత్తితో దాడి ఇరువురికి గాయాలు

పులివెందుల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామ పంచాయతీ కానేపల్లె గ్రామంలో కుటుంబకలహాలతో గంగనపల్లె బాషా కత్తితో దాడికి పాల్పడ్డ సంఘటనలో బండి సూరి వీరయ్య, ఉడవ గండ్ల బాషాలకు గాయాలయ్యాయి. వివరాలిలా.. బండిసూరి వీరయ్య కొడుకు దస్తగిరి అదే గ్రామంలో ఉండే గంగనపల్లె బాషా కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే వారిరువురు మధ్య విబేధాలు రావడంతో దస్తగిరి తన భార్యతో విడాకులు కావాలంటూ కోర్టు ద్వారా నోటీసులు పంపారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య విబేధాలు వచ్చాయి. మంగళవారం రాత్రి బండి వీరయ్య తన బంధువైన ఉడవగండ్ల బాషాతో కలిసి గంగనపల్లె బాషా ఇంటి వద్దకు వెళ్లి ఘర్షణకు దిగాడు. దీంతో గంగనపల్లె బాష ఇంటిలో ఉన్న కత్తి తీసుకుని బండి సూరి వీరయ్యను అతనితో వచ్చిన బాషాపై కత్తితో పొడవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారని.. బాధితుల ఫిర్యాదు మేరకు గంగనపల్లె బాషాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శ్యామలాంబకు వెండి ఆభరణాలు సమర్పణ



చిట్వేలి, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమేశ్వరాలయంలోని శ్యామలాంబదేవి అమ్మవారికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దోనెల రవీంద్రనాథ్ ధర్మపత్ని వెంకటకళ్యాణి కుటుంబ సభ్యులు మూడు లక్షల విలువైన వెండి తొడుగు, ఇతర ఆభరణాలను సమర్పించారు. మన్నూరు కిషోర్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి పెద్ద హస్తాలు, దోర్నాదుల సంతోష్ కుటుంబ సభ్యులు చిన్న హస్తాలు, కామిశెట్టి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు పాదాలు, సెంకూరి నారాయణ కుటుంబ సభ్యులు కర్ణాభరణాలు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ చైర్మన్ వీరాంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, SHAIK SYED MOHAMMAD ALI S/o SHAIK SYED KHADAR VALLI, R/at D.No.11-28, Kamathampalli, Angallu, Kurabalakota Mandal, Annamayya Dist, A.P.-517 325, do hereby declare that While issuing my Passport bearing No: M4354205 oversight my father name was mentioned as KHADAR VALLI SHAIK (Wrong Name) instead of SHAIK SYED KHADAR VALLI (Correct Name).
AJT - 1143

CHANGE OF NAME
Jettigundla Prabhavathamma (Old Name) W/o Mangasamudram Narasimha Reddy, residing at 5-29, Narayanareddypalle, Goduguchintha, Puthalapattu, Chittoor, Andhra Pradesh. I declared that I have changed my name as JETTIGUNDLA PRABHAVATHI (New Name)
AJT - 1144

CHANGE OF NAME
I, BANGLORE AMARANADHA REDDY S/o BANGLORE IAYAGOPAL REDDY (Old Name) R/o D No. 11-81,THALAMBEDU,CHITTOOR Dt., AP., INDIA. I HAVE A CHANGED MY NAME AS BANGLORE AMARANATH REDDY S/o BANGLORE IAYAGOPAL REDDY (New Name) My Son Old PPT NO .S4737287.
AJT - 2083

CHANGE OF NAME
I, MALLAKUNTA SUBRAMANYAM REDDY KISHORE CHANDRA REDDY, R/of D.No.1-5, Mallakunta V&P, Thavanampalli (M) Chittoor District, -517129, Andhra Pradesh, India. I have changed my name from MALLAKUNTA KISHORE CHANDRA REDDY (Old Name) to MALLAKUNTA SUBRAMANYAM REDDY KISHORE CHANDRA REDDY (New Name).
AJT - 2085

WANTED
తిరుపతిలో ప్రముఖ కంపెనీ నందు బట్టలు ఐరన్ చేయుటకు అనుభవం కలిగిన వ్యక్తులు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును సంప్ర. 99631 86385, 93812 15592
AJT - 4452

WANTED
తిరుపతిలోని ప్రముఖ రియల్‌ఎస్టేట్ నందు పనిచేయుటకు 10 సం.ల అనుభవం గల అకౌంటెంట్ Part/Full Time కావలెను. వివరాలకు సం.ప్ర: సెల్: 96760 22100
AJT-4466

వెంటనే కావలెను
పీలేరులో హోటల్ నందు పనిచేయుటకు బ్రాహ్మణ వంట మనిషి వెంటనే కావలెను. సంప్ర. : 78931 23589
AJT - 187137

TAKE OVER
బ్యాంకు, ప్రైవేట్ సంస్థలలో తాకట్టు పెట్టిన బంగారం మా డబ్బుతో విడిపించి ఇతర సంస్థలో తాకట్టు పెట్టబడును సంప్రదించండి. 89199 62254
AJT - 4461

PLOT FOR SALE
New Venture Launched near TIRUPATI IIT & IISER (Yerpedu) Spot registration with final approval & 36 months Emi: 88015 01376
AJT-4465

PLOTS FOR SALE
తిరుపతికి దగ్గర TCL Company కి ఎదురుగా 100 Ft. రోడ్డుకు అనుకొని తుడా అప్రూవ్డ్ వెంచర్‌లో ప్లాట్స్ తక్కువ ధరకే అమ్మబడును. Cont. : 94943 92069, 82470 75857
AJT - 4447

పాస్‌పోర్ట్ పోయినది
నేను 23/09/2024న తిరుపతిలో నా పాస్‌పోర్ట్ (నెం.S7444367) పోగొట్టుకున్నాను. ఎవరైనా దానిని కనుగొంటే, దయచేసి నన్ను 9566891336 నంబర్‌లో సంప్రదించండి లేదా ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోపు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు తెలియ జేయండి. AJH-GMUAJ-2

హరిహర వాటర్ ప్రూఫింగ్
స్లాబ్స్, బాత్రూమ్స్, రూఫ్స్, బాల్కనీ లీకేజిలు, గోడ చెమ్మలు అత్యాధునిక కెమికల్స్ టెక్నాలజీతో పగలగొట్టకుండా 8సం.గ్యారంటీతో చేయబడును. 8985714713. AJH 601

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర 7382114647
AJA- 198462

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

అయ్యవార్లు... ఇది మీకు తగునా...?

- ఒకేరోజు ఇరువురు ఉపాధ్యాయులు గైర్హాజరు



ఉపాధ్యాయుల గైర్హాజరుతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కాశినాయన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇరువురు ఉపాధ్యాయుల తీరు మారూటే సపరేటు అన్నట్లుంది. ఒకవైపు ప్రభుత్వం సర్కారు బడుల బలోపేతానికి చర్యలు చేపడుతుంటే అలాంటివి మాకు వర్తించవు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. బుధవారం ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారు. ఉదయం 11గంటలు అవుతున్నా ప్రధానోపాధ్యాయుడు ఓ.బాలశోభన్‌కుమార్, మరో ఉపాధ్యాయుడు వెంకట్రామయ్య పాఠశాలకు చేరుకోలేదు. ఒకవైపు అదేరోజు సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఉదయం నర్సాపురం ఎమ్మార్సీ కార్యాలయానికి వెళ్లి ప్రశ్నపత్రాలు తెచ్చుకొని ఉదయం 9.30 గంటలకు పరీక్షను ప్రారంభించాలి. అవేవి పట్టించుకోకుండా ఇరువురు ఉపాధ్యాయులు బడికి ఎగనామం పెట్టారు. ఈవిషయం ఆలస్యంగా తెలుసుకున్న సంబంధిత అధికారి ఉదయం 11.30 గంటలకు సీఆర్పీని పంపి మమ అన్నట్లు పరీక్ష నిర్వహించారు. ఇక్కడి అయ్యవార్లు గత కొంతకాలంగా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని.. సమయపాలన పాటించడం లేదని పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదంటున్నారు స్థానికులు. పాఠశాల సీఆర్పీ రవి కూడా ఈఇద్దరు ఉపాధ్యాయుల తీరుపై పలుమార్లు ఎంఈవో దృష్టికి తీసుకు పోయినట్లు సమాచారం. ఇరువురు ఉపాధ్యాయుల మధ్య సఖ్యత కొరవడి.. ఒకరిపై ఒకరు పోటీపడి బడికి గైర్హాజరవుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయంపై ఎంఈవో2 ఓ.ప్రమీళను వివరణ కోరగా తనకు ముందస్తు సమాచారం లేదని.. విషయం తెలుసుకొని 11 గంటల తర్వాత సీఆర్పీని అక్కడికి పంపించానన్నారు. ఇరువురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకొని ఉన్నతాధికారులకు తెలిజేస్తామన్నారు.

రీసర్వే పై పుట్టగొడుగుల్లా ఫిర్యాదులు

● నాలుగు గ్రామాలలో 911 దరఖాస్తులు

బి.కొత్తకోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీసర్వేపై అభ్యంతరాలు, అభ్యర్థనలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. బి.కొత్తకోట మండలంలో కేవలం నాలుగు గ్రామాలు గుమ్మసముద్రం, కోటావూరు, తుమ్మణంగుట్ట, గోళ్లపల్లె రెవెన్యూ గ్రామాలలో మాత్రమే భూముల రీసర్వే పూర్తి అయింది. ఈ రీసర్వే పై అనుమానాలు, అభ్యంతరాలు ఉంటే చెప్పాలంటూ పై నాలుగు గ్రామాలలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటావూరులో 249, తుమ్మణంగుట్టలో 186, గుమ్మసముద్రంలో 206, గోళ్లపల్లెలో ఏకంగా 270 మంది రైతులు రీసర్వే పై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అర్జీలు ఇచ్చారు. మ్యుటేషన్లు, వారసత్వ సమస్యలపై ఎక్కువ అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ మహమ్మద్అన్సారీ తెలిపారు. బుధవారం మండలంలోని గోళ్లపల్లెలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామసభలలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయడంతో పాటు, వాటిపై లోతుగా విచారణ చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వీరాంజినేయులు, వీఆర్ఓ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బండెన్నస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో అంబళం పూజ



బండెన్నస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి విగ్రహంతో పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి

బి.కొత్తకోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం బీరంగి పంచాయతీ పరిధిలో వెలసిన బండెన్నస్వామి ఆశ్రమంలో బుధవారం అయ్యప్పస్వామి అంబళంపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి లక్ష్మీపతిస్వామితో పాటు సుండుపల్లి, చింతామని, కోలార్, రాయచోటి, గౌనిపల్లె, బి.కొత్తకోట, బీరంగి తదితర ప్రాంతాలకు చెందిన భక్తాదులు ఈ పూజలో పాల్గొని భజనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన గురుస్వాములు సుందరంగా అలంకరించిన అంబళం ఎదుట ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. దీక్ష చేపట్టిన స్వాములతో పాటు, వందలాదిమందికి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. లోక కళ్యాణార్థం తరచూ ఈ ఆశ్రమంలో సనాతనధర్మ పరిరక్షణలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి విగ్రహానికి చేసిన అలంకరణ ఆకట్టుకుంది

రెడ్డెమ్మతల్లి ఆలయానికి వేలం ద్వారా రూ.9 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

గుర్రంకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):రెడ్డెమ్మకొండ ఆలయంలో బుధవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా అమ్మవారికి రూ.9,06,800 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. అమ్మవారి ఆలయంలో ప్రతి ఏటా టోల్‌గేట్, కొబ్బరి కాయలు, హోటల్, కూల్‌డ్రింక్స్, ఫొటోలు, వస్త్రాలు సేకరించుకొనుటకు వేలం పాటలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారికి టోల్ గేట్ ద్వారా రూ.4.23 లక్షలు, కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకొనుటకు రూ.1.97 లక్షలు, టీ, టిఫన్ నిర్వహణకు రూ.52,600, భక్తులు సమర్పించే వస్త్రాలు సేకరించుకొనుటకు రూ.1,12,500, కూల్ డ్రింక్స్ అమ్ముకొనుటకు రూ.40,700, అమ్మవారి ల్యామినేషన్ ఫొటోలు, బొమ్మలు అమ్ముకొనుటకు రూ.81 వేలుతో కలిపి అమ్మవారికి మొత్తం రూ.9,06,800 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

దినదినాభివృద్ధి చెందాలి



చిట్స్‌కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేఎస్ఎస్ ప్రసాద్

కలకడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):ఎం.వి రావు చిట్స్ ప్రైవేట్స్ లిమిటెడ్ దినదినాభివృద్ధి చెందాలని చార్టెడ్ అకౌంటెంట్ కే.ఎస్ఎస్ ప్రసాద్ అకాంక్షించారు. బుధవారం ఆయన కలకడ మండలం కేబాటవారిపల్లె చిట్స్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ అనతి కాలంలోనే వారి మన్ననులు పొందాలని నిర్వాహకులకు సూచించారు. కాగా ప్రతి ఏడు వార్షికోత్సవం రోజైన నవంబరు 6వ తేదీన మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలకు సంబంధించి టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత పరంగా మొదటి, రెండవ, మూడవ స్థానాలు పొందిన పాఠశాలలకు రూ.30 వేలు వంతున ఇవ్వనున్నట్లు బిజినెస్ అడ్వైజర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. కార్యక్రమంలో పునీత్‌చౌదరి, శారద, గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

9.10 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె అర్బన్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కాలనీలో ఈ నెల 9,10 తేదీల్లో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సంహిత మోటూరి తెలిపారు. చెన్నై నగరంలోని ఫర్టిలిటీ సెంటర్, మదనపల్లెలోని శ్రీదేవి హాస్పిటల్ సంయుక్తంగా సంతానం లేని దంపతులకు ఉచితంగా స్కానింగ్ నిర్వహిస్తునట్లు తెలిపారు. స్పెషలిస్టు, డాక్టర్లు ఈ ఉచిత వైద్య శిబిరానికి హాజరవుతారన్నారు. మరెన్నీ వివరాలకు 8639140686, 7337040686 సంప్రదించాలని తెలిపార

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

● రాజకీయ విమర్శలు పట్టించుకోను ● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. కొందరు రాజకీయంగా విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వాటిని తాను పట్టించుకోనని ఆయన స్పష్టం చేశారు. బుధవారం స్థానిక సీటీఎం రోడ్డు విస్తరణలో భాగంగా చింతచెట్లు తొలగిస్తున్న పనులను ఎమ్మెల్యే దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో వాణిజ్యకేంద్రమైన సీటీఎం రోడ్డులో 26 పాత చింతచెట్లు ఉన్నాయని, ఏళ్లనాటి ఈ చెట్లలో కొన్ని కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల సబ్‌కలెక్టరేట్‌లో ఇలాంటి చింతచెట్టు కూలిపోయి ఒక వృద్ధుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని అందుకే ఈ చెట్లను తొలగించడంతో పాటు, రోడ్డు విస్తరణ చేస్తున్నామన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలసి పట్టణంలో ఇరుకైన రోడ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ శాఖ అనుమతులు తీసుకునే చింత చెట్లు తొలగిస్తున్నామన్నారు. కేవలం 19 అడుగుల వెడల్పు ఉన్న సీటీఎం రోడ్డు చింతచెట్లు తొలగించడంతో 60 అడుగుల వెడల్పు వస్తోందన్నారు. ఇరువైపులా దుకాణాల యజమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించి, ఇరువైపులా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పాటు పుంగనూరు రోడ్డులోని మున్సిపల్ బోర్డు నుంచి కదిరి రోడ్డులోని నీరుగట్టువారిపల్లె వరకు ప్రభుత్వ భవనాల స్థలాన్ని తీసుకుని రోడ్డు విస్తరణ చేస్తామన్నారు. టీడీపీ మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ మాట్లాడుతూ మదనపల్లెలో ఏ ఎమ్మెల్యే కూడా పట్టించుకోని రోడ్ల విస్తరణను షాజహాన్‌బాషా చేపట్టి సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా మున్సిపాలిటీలో గుంతలు లేని, వెడల్పైన రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. తంబళ్లపల్లె టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు మాట్లాడుతూ అభివృద్ధి పనులను అడ్డుకోవడానికి కొందరు వెన్నుపోటు రాజకీయాలు చేయడం తెలిసిందేనని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, మొటుకు శివ, ఎం.మధుసూదన్‌రెడ్డి, గణపతి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనుల గురించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కలకడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని వక్తలు సూచించారు. బుధవారం బాటవారిపల్లె హైస్కూల్‌లో కలకడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ చేశారు. మండలంలోని పది హైస్కూళ్లలో 200 మంది విద్యార్థులకు నైతిక విలువలు-విద్యార్థుల బాధ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు వరుసగా 5 వేలు, 3 వేలు, 2 వేలు వంతున రూ.లక్ష మొత్తాన్ని లయన్స్ క్లబ్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన కలకడలో రెండేళ్ల క్రితం శాఖ ఏర్పాటు కావడం దగ్గుబాటి కృషి ఫలితంగా సాధ్యమైందన్నారు. ఈ కోవలో బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో రూ.5 లక్షలు వెచ్చించి విద్యార్థులకు సౌకర్యంగా సార్వత్రిక కళావేదిక నిర్మాణంతోపాటు వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులు 600 మందికి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లయన్‌లు ప్రసాద్, గౌతమ్‌రెడ్డి, శశిధర్‌రావు, భాస్కరాచారి, మురళీమోహన్, రజనీకుమార్, అబ్బూరి తిరుపతినాయుడు, మనోజ్‌కుమార్‌రెడ్డి, నరేష్, పునీత్‌చౌదరి, కే.శ్రీనివాసులరెడ్డి, గంగాద్రినాయుడు, ఎంఈవో రామచంద్రారెడ్డి, చెంగల్‌రాయులు, ఉపాధ్యాయులు రమణ, బాబురెడ్డి, శ్రీనివాసులు, సీవీరమణలు పాల్గొన్నారు.

నెట్, సెట్‌లపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎయిమ్ అకాడమి లెర్నింగ్ సీఈవో అహ్మద్ బాషా

కురబలకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నెట్(నేషనల్ ఎలిజిబులిటి టెస్ట్), సెట్ (స్టేట్ ఎలిజిబులిటి టెస్ట్)లపై అవగాహన పెంచుకోవాలని ఎయిమ్ అకాడమి లెర్నింగ్ సీఈవో అహ్మద్ బాషా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసీఏ నెట్, సెట్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు విద్యార్థులలో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, విభాగాధిపతి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెంపో ఢీకొని లైన్‌మేన్‌కు తీవ్ర గాయాలు

ములకలచెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): టెంపో ఢీకొని ట్రాన్స్‌కో లైన్‌మేన్ అప్పిరెడ్డి(52) తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం రాత్రి ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వేపూరికోట పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన అప్పిరెడ్డి తంబళ్లపల్లె ట్రాన్స్‌కో విభాగంలో లైన్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే తంబళ్లపల్లెలో విధులు నిర్వర్తించి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరి వస్తుండగా మార్గ మధ్యంలోని దేవళచెరువు వద్దకు రాగానే ద్విచక్రవాహనాన్ని టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్సల కోసం అక్కడి వైద్యులు తిరుపతి రూయాకు రెఫర్ చేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

కురబలకోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగాగాయపడ్డారు. మండలంలోని తెట్టు పంచాయతీ పులుసుగుంతలకు చెందిన రాము, మండ్యంవారిపల్లె ఆదెప్పలు సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో అంగళ్ళుకు వెళుతుంగా మార్గ మధ్యంలోని ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని 108సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేదల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

వాల్మీకిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే సీఎం నారా చంద్రబాబునాయుడి ధ్యేయమని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నగిరిమడుగు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. స్థానికంగా మహిళలు, యువత, ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వ తీసుకున్నారు. మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ మదనమోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనాథరెడ్డి, ఆదిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ద్వారకనాథరెడ్డి, రమణ, యల్లప్ప పాల్గొన్నారు.

పీఎంఏవై గృహాలను పూర్తి చేయండి

కురబలకోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం మంజూరు చేసిన పీఎంఏవై గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలనిఈఈ వెంకటదాస్, డీఈ వెంకటరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణొడ్డిపల్లె, శ్రీరాములవారిపల్లె లే అవుట్‌లను వారు పరిశీలించి మాట్లాడుతూ మదనపల్లె డివిజన్ పరిధిలో 31780 గృహాలు మంజూరుకాగా 16455 పూర్తయ్యాయని, 13360 గృహాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న గృహాలను డిసెంబరు 31లోగా పూర్తి చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

తంబళ్లపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తంబళ్లపల్లె గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి రాంచరణ్ నాయక్ అర్హత సాధించినట్లు పీఈటీ నిజాముద్దీన్ దేశ్‌ముఖ్ తెలిపారు. మదనపల్లెలో అండర్-14 విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలలో రాంచరణ్ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు.

ఉపాధి కూలీలకు అదనంగా పనులు కల్పిస్తాం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో తిరుపాలప్ప

పెద్దతిప్పసముద్రం నవంబర్ 6 (ఆంధ్ర.జ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి కూలీలకు అధనంగా పనులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏపీవో తిరుపాలప్ప పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మల్లెల గ్రామంలోని సచివాలయంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా అదనంగా పనులు కల్పించి కూలీలు పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లకుండా నివారించాలనే ఉద్దేశ్యంతో నూతనంగా 37 పనులను గుర్తించినట్లు తెలిపారు. గ్రామాల్లో రైతుల పొలాల్లో కందకాలు, మట్టి రోడ్ల నిర్మాణాలు, చెరువులకు కాలువ నిర్మాణాలు, వంటి పనులను ఉపాధి కూలీలు చేసుకోవచ్చన్నారు. కూలీలకు అధనంగా పని దినాలు, కూలి రేట్లు కూడా పెంచి పని కల్పిస్తున్నట్లు ఏపీవో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో నూతనంగా ఉపాధి పనులు చేయాలనే ఆసక్తి ఉన్న వారు కొత్తగా జాబ్ కార్డుకు ధరఖాస్తు చేసుకుంటే వారికి వెంటనే జాబ్ కార్డును అందిస్తామన్నారు. ఈ గ్రామ సభల్లో ఆయా గ్రామాల్లోని స్థానిక సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

కురవంక పంచాయతీని అభివృద్ధి పరుస్తా

మదనపల్లె అర్బన్, నవంబరు 6:(ఆంధ్రజ్యోతి) స్థానిక కురవంక పంచాయతీని అభివృద్ధి పరుస్తానని చిప్పిలి సర్పంచ్ పసుపులేటి చలపతి పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో నూతనంగా సిమెంట్ రోడ్డు, మురుగునీటి కాలువ నిర్మాణాలు చేపట్టామన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా తీరుస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

బాల కార్మికులను ప్రోత్సహిస్తే చట్టరీత్యా శిక్షార్హులే

కలికిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పని ప్రాంతంలో బాల కార్మికులను నియమించుకుంటే యజమానులు చట్ట రీత్యా శిక్షార్హులవుతారని జిల్లా కార్మిక శాఖ అధికారి మధుబాబు హెచ్చరించారు. 14 ఏళ్ళ లోపు పిల్లలను పనిలో నియమించుకుంటే బాల కార్మిక నిరోధక చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన కలికిరి పట్టణంలోని హోటళ్ళు దుకాణాలు, మెకానిక్ షాపులు తదితర వ్యాపార ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతర బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహి ళా పోలీసు వజ్రావతి, డీసీపీయూ సోషల్ వర్కర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

తంబళ్లపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లోని మహిళా సభ్యులకు సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యమని ఆర్బీఐ కౌన్సిలర్ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మహిళా సభ్యులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని నెంబర్ల నుంచి సెల్ ఫోన్లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. ఎవరైనా బ్యాంకు వివరాలు, ఓటీపీ, ఆధార్ కార్డు నెంబరు, రేషన్ కార్డు నెంబరు తదితర విషయాలను అడిగినపుడు తెలపకూడదన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సంఘమిత్రలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

దేవదాయ భూమి లీజు విషయమై వివాదం

● గ్రామసభలో ఘర్షణ ● పలువురిపై పోలీసులకు ఫిర్యాదు



వాగ్వాద ఘటనపై అక్కడి జనంతో మాట్లాడుతున్న పోలీసులు

రామసముద్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం కురిజల పంచాయతీ కేంద్రంలోని పురాతన చెన్నకేశవస్వామి ఆలయ భూమి లీజు విషయమై వివాదం చోటుచేసుకుంది. ఈ ఆలయానికి సర్వే నెంబర్ 52/14లో 1.6సెంట్ల భూమి ఉండగా దానిని గత 30ఏళ్లుగా ఇదే గ్రామానికి చెందిన చెంగారెడ్డి అనుభవిస్తూ ఉన్నారు. ఈనేపథ్యంలో ఆలయ భూమిని దేవదాయశాఖ వారు లీజుకు ఇచ్చి తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ నిర్మాణానికి వెచ్చించాలని నిర్ణయించుకుని బుధవారం గ్రామ సభ నిర్వహించింది. దీంతో చెంగారెడ్డి అతని అనుచరులు లీజును వ్యతిరేకిస్తూ దేవదాయ శాఖ అధికారులను అడ్డుకోవడంతోపాటు గ్రామస్థులతో వాగ్వాదానికి దిగారు. సంఘటనను విలేకర్లు వీడియో తీస్తుండగా చెంగారెడ్డి వర్గానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి ఓ మీడియా ప్రతినిధిపై దాడి చేసి, కుర్చీతో కొట్టి సెల్‌ఫోన్ లాక్కున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. దేవదాయశాఖ అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారని చెంగారెడ్డి మరికొంత మందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయంపై విచారణ చేపట్టి బాధితులపై తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పట్టణాలు, గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్టేషన్‌లో ఆయన విలలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె సర్కిల్ పరిధిలో 22 ప్రైవేటు మద్యం దుకాణాలకు రెండేళ్ల పాటు పర్మనెంట్ లైసెన్సులు జారీ చేస్తున్నామన్నారు. ఈ దుకాణాల్లో వ్యాపారులు ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. దుకాణాల పక్కన మద్యం తాపించడం, లూస్ సేల్స్ చేస్తే కేసులు పెట్టి, దుకాణాల లైసెన్సుల రద్దుకు సిఫారసు చేస్తామన్నారు.

ఫ్రీ హోల్డ్, చుక్కల భూములపై విచారణ చేపట్టండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జ్ ఆర్డీవో రాఘవేంద్ర

కురబలకోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఫ్రీ హోల్డ్ భూములతో పాటుగా చుక్కల భూములపై పకడ్బందీగా విచారణ చేపట్టాలని ఇన్‌ఛార్జ్ ఆర్డీవో రాఘవేంద్ర పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కురబలకోట తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు సిబ్బంది గ్రామాలకు వెళ్లి భూముల విచారణ చేపట్టడంతో పాటుగా తప్పనిసరిగా తప్పులు లేకుండా సర్వే చేయాలన్నారు. ప్రధానంగా ఫ్రీహోల్డ్ భూములతో పాటుగా చుక్కల భూములకు సంబంధించి సర్వేలను త్వరగా పూర్తి చేయడంతో పాటుగా ఏవైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ తపశ్విని, ఆర్ఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: చుక్కల భూముల విషయంలో ఎక్కడా సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని మదనపల్లె ఇన్‌ఛార్జి ఆర్‌డీవో రాఘవేంద్ర ఆదేశించారు. బుధవారం వాల్మీకిపురం రెవెన్యూ కార్యాలయంలో చుక్కల భూముల క్రమబద్దీకరణపై గత వారం రోజులుగా మండల వ్యాప్తంగా జరుగుతున్న రీ వెరిఫికేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చుక్కల భూముల వివరాలను తిరిగి పరిశీలిస్తూ ఈనెల 15లోగా పూర్తి చేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుగుణ, సర్వేయర్ పూర్ణచంద్ర, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మా భూమిని మరొకరికి రాసిచ్చారంటూ ఫిర్యాదు

కురబలకోట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పూర్వీకుల నుంచి మా ఆధీనంలో ఉన్న భూమికి మరొకరికి పట్టా ఇచ్చారని తహశీల్ధార్‌కు ఓ బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి బాధితుడు వెంకటప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లెకు చెందిన సర్వే నెంబరు 629లో 2.34 ఎకరాల భూమి ఉందని అయితే మాకు తెలియకుండానే గ్రామ వీఆర్ఏ కవిత భర్త శంకర పేరు మీద ఖాతా నెంబర్ 511న 2.34 ఎకరాలకు వన్‌బీ చేసుకున్నారన్నారు. ఈ భూమికి సంబంధించి పట్టా పుస్తకం మా దగ్గర ఉందన్నారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు

నిమ్మనపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ధనంజేయులు హెచ్చరించారు. బుధవారం మండలంలోని స్థానిక పంచాయతి బోడిబండ సమీపంలో గల సర్వేనెంబరు.767లో 4.72 సెంట్ల వంక పొరంబోకు ప్రభుత్వ భూమిలో గత రెండు రోజులుగా రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా మామాడి మొక్కలను నాటాడు. విషయం తెలుసుకొన్న రెవెన్యూ సిబ్బంది, పోలీసు బందోబస్తుతో ప్రభుత్వ భూమిలో నాటిన 60మామిడి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆర్ఐ అనంతలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటిన వ్యక్తులపై చర్యలు తీసుకొంటామని తెలిపారు. అలాగే భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని కూసాలు నాటడంతో వాటిని కూడా తొలగించినట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూమును ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపినాథ్, వీఆర్వో రెడ్డిరాణి పాల్గొన్నారు.

టీడీపీ నేత చొరవతో నీటి సమస్యకు పరిష్కారం



పూర్తయిన తాగునీటి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో హరినారాయణ

ములకలచెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి చొరవతో ములకలచెరువులో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. ముంబాయి - చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఏడాదిన్నర క్రితం తాగునీటి పైప్‌లైన్ తొలగించడంతో ములకలచెరువులో రోడ్డుకిరువైపులా ఉన్న గృహాలకు నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో విషయాన్ని స్థానికులు టీడీపీ నేత జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. దీంతో బుధవారం పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరించారు. కాగా ఎండీడీవో హరినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్‌కుమార్, మాజీ ఎంపీపీ నరసింహులు, కార్యదర్శి ఇబ్రహీం, నాయకులు ప్రసాద్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు కొత్త పైప్‌లైన్‌ను పరిశీలించారు. ఏడాదిన్నరగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించిన జయచంద్రారెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలివ్వాలి



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన తెలియచేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె అర్బన్, నవంబరు 6:(ఆధ్రజ్యోతి) మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ద్వారా పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరోజా డిమాండ్ చేశారు. బుధవారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించాలని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా జీతాలు చేలించకుండా ఉంటే వారి కుటుంబం జీవనం సాగించేదేలా అని ఆయన ప్రశ్నించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులని 24 గంటలు పని చేయించడం తగదన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో జాయిన్ అయిన ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు చెల్లిస్తున్నారని అవుట్ సోర్సింగ్ వర్కర్స్‌కు జీతాలు చెల్లించకుండా వారిని ఎందుకు మోసం చేస్తున్నారని సంబంధింత ఆస్పత్రి ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, ఏఐటీయూసీ నాయకులు, దేవా, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు మురళి, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ శ్రీనివాసులు, దాము, నవీన్, రాజేష్, పూర్ణిమ, అభిషేక్, సంపూర్ణ, సలీం, అన్నపూర్ణ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నేతలు



మదనపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్‌నాయుడును మదనపల్లె ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, టీడీపీ నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలలో బుధవారం అతిథిగృహంలో బీఆర్.నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యేతోపాటు టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, పెంచుపాడు స్వామి, పూల మురళి, తదితరులు ఉన్నారు.

పీలేరులోని ఓ టీ షాపులో చోరీ

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం అంబేడ్కర్ సర్కిల్‌లో జ్యోతి అనే వ్యక్తి టీ దుకాణం బుధవారం చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు రోజులాగానే బుధవారం ఉదయం దుకాణం వద్దకు రాగా షట్టర్ తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించానన్నారు. వెంటనే దుకాణం తెరిచి చూడగా గళ్లా పెట్టెలో ఉండాల్సిన రూ.10 వేలు లేకుండా పోయిందన్నారు. పొద్దెక్కిన తరువాత చుట్టుపక్కల ఉన్న దుకాణాల సీసీ కెమెరాలు పరిశీలించగా పదేళ్లు కూడా లేని ముగ్గురు పిల్లలు షాపు వద్దకు వచ్చి షట్టర్ ముందు పడుకున్నట్లు నటిస్తూ చాకచక్యంగా షట్టర్ తెరిచి, అందులో దూరి చోరీకి పాల్పడడం రికార్డు అయ్యింది. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి పరిశీలించి చిన్నారుల ద్వారా ఎవరో పెద్దవాళ్లే చోరీలు చేయిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కేసు నమోదు చేసుకుని పట్టణంలోని ఇతర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా విచారణ ప్రారంభించారు.